ANN తెలుగు
Follow: @ANNTELUGU
01-10-2025
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 296 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

**తెలంగాణ టాక్**

## Arattai
### అరట్టై.. అదుర్స్
వాట్సాప్‌కు పోటీగా ఇండియన్ యాప్
జోహో యాప్.. సింపుల్ సూపర్
04

## TATA CONSULTANCY SERVICES
### టీసీఎస్ నుంచి 80 వేల మంది ఔట్
లేఆఫ్‌ల కాలం
02

## తెలంగాణ తల్లి ఫ్లైఓవర్


- తెలుగుతల్లి ఫ్లై ఓవర్ పేరు మార్చుతూ బోర్డు
- సీఎం రేవంత్ పై నెటిజన్ల ప్రశంసలు

03



## తిలక్ వర్మ.. సూపర్ ఆడావు
### యువ క్రికెటర్‌కు సీఎం రేవంత్ ప్రశంస
**ముఖ్యమంత్రితో భేటీ.. బ్యాట్‌ను బహూకరించిన తిలక్**

హైదరాబాద్, మహా: ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌పై అద్భుతంగా ఆడి భారత్‌ను విజయ తీరాలకు తీసుకెళ్లిన యువ క్రికెటర్ తిలక్ వర్మ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. జూబ్లీహిల్స్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన తిలక్‌ను.. సీఎం సత్కరించి అభినందించారు. ఫైనల్ మ్యాచ్ విశేషాలతో పాటు తిలక్ గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు సీఎం. తిలక్‌ను ప్రోత్సహిస్తూ వచ్చిన కోచ్‌ను మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తిలక్ వర్మ క్రికెట్ బ్యాట్‌ను బహూకరించారు. ఆసియా కప్ ఫైనల్ లో.. ఇండియా కష్టాల్లో ఉందనుకున్న సమయానికి తిలక్ వర్మ ఆదుకుని అద్భుత విజయాన్ని అందించిన విషయం తెలిసిందే. 147 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇండియాకు.. టాప్ ఆర్డర్ వెంట వెంటనే పెవిలియన్ బాట పట్టడంతో మ్యాచ్ భారాన్ని తన భుజాలపై వేసుకుని 53 బంతుల్లో 69 రన్స్ చేసి స్టన్నింగ్ విక్టరీ ఇచ్చాడు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన వారిలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనీ బాలాదేవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

SRI GOLD
TRUSTED GOLD BUYERS

| బంగారం ధరలు | |
|---|---|
| 24 క్యారెట్ | 1,15,480 |
| 22 క్యారెట్ | 1,05,850 |
| సిల్వర్ (కేజీ) | 1,49,000 |


# స్థానిక పరీక్ష


### సన్నద్ధం కావాలని సీఎం ఆదేశం
### మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్
- ప్రతి జడ్పీటీసీకి.. మూడు పేర్లు.. ఐదులోగా ప్రతిపాదనలు
- బీసీ రిజర్వేషన్ల అంశంపై మంత్రి పొన్నం నివాసంలో కీలకభేటీ
- అక్టోబర్ 8న కోర్టు విచారణ నేపథ్యంలో సమాలోచనలు

**హైదరాబాద్, మహా :** స్థానిక ఎన్నికలకు రిజర్వేషన్లు ఖరారుచేయడంతో పాటు షెడ్యూల్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇపుడు కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ఆ దిశగా సమాయత్తం చేయాలని డిసైడ్ అయ్యారు. అక్టోబరు 5వ తేదీ నాటికి జడ్పీటీసీ అభ్యర్థుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంగళవారం రాత్రి జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఇంచార్జ్ మంత్రులు ఆయా జిల్లాల మంత్రులతో, డీసీసీ అధ్యక్షులతో ఎంపీ లతో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో ముఖ్య నాయకులతో సంప్రదించి ప్రతి జడ్పీటీసీ స్థానం నుంచి ముగ్గురు అర్హులైన అభ్యర్థుల పేర్లను ప్రతిపాదించాలని సీఎం సూచించారు. అక్టోబర్ 5వ తేదీనాటికి పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు ప్రతిపాదించాలని, అన్ని రకాలుగా అర్హులైన అభ్యర్థులను పీసీసీ ఎంపిక చేస్తుందని ఎట్టి పరిస్థితుల్లో ఎక్కడ చిన్న పొరపాటు కూడా జరగవద్దని గెలుపే

మిగతా 2లో



కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో
## సీఎం చంద్రబాబు కీలక భేటీ
**ఢిల్లీ, మహా :** కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సీఎం చంద్రబాబు మంగళవారం భేటీ అయ్యారు. సమావేశంలో అమరావతి రాజధాని నిర్మాణానికి నిధులు, పోలవరం ప్రాజెక్టుపై చర్చించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అమిత్ షాకు చంద్రబాబు వివరించారు. సమారు 40 నిమిషాలపాటు సమావేశం కొనసాగింది.

మిగతా 2లో

## సర్పంచ్ ఎన్నికలు ఇప్పుడే జరగవు!
### దసరాకు దావత్‌లు ఇవ్వకండి.. డబ్బు ఖర్చు చేసుకోకండి
**బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హాట్ కామెంట్స్**



**హైదరాబాద్, మహా:** స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ హాట్ కామెంట్స్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పుడే ఉండకపోవచ్చంటూ వ్యాఖ్యానించారు. సర్పంచ్ అభ్యర్థులు తొందరపడి డబ్బులు ఖర్చు పెట్టొద్దంటూ సూచించారు. ''తొందరపడి దసరాకు దావత్‌లు ఇవ్వకండి. లీగల్‌గా చెల్లుబాటు కాని ఎన్నికలతో జాగ్రత్తగా ఉండాలి'' అంటూ హెచ్చరించారు. బీసీలకు 42 శాతం కోటా పేరుతో రేవంత్ సర్కార్ డ్రామా ఆడుతోందని ఫైర్ అయ్యారు. రాజ్యాంగ బద్ధంగా లేదని కోర్టు కొట్టేస్తే పరిస్థితేంటి?. మహారాష్ట్రలో స్థానిక ఎన్నికలు జరిగాక కోర్టు రద్దు చేసిందన్నారు. ఎన్నికల్లో ఖర్చు పెట్టిన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారని అంటూ ఈటల గుర్తు చేశారు.

**ముగ్గురు మంత్రులు అలా చెబుతున్నారు..**
ఎవరిని మోసం చేయడం కోసం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారని ఈటల రాజేందర్ ప్రశ్నించారు.

మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్లపై మోదీని అడిగే దమ్ము ఉందా?


- ఈటల, బండి సంజయ్, అరవింద్‌కు పీసీసీ చీఫ్ ఛాలెంజ్
- బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే.. రెండు పార్టీలు కలిసే సంసారం చేస్తున్నాయి
- దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా బీఆర్ఎస్ బాకీ కార్డు ప్రచారం
- నిరుద్యోగుల కలలు సాకారం చేస్తే బాకీ పడ్డట్టా.. రైతు భరోసా ఇస్తే బాకీ పడ్డట్టా?
- ప్రతిపక్షాలపై టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్

02



జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తుది ఓటర్ల
## జాబితా విడుదల
- మొత్తం ఓటర్లు 3,99,000
- ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

వివరాలు 2లో

| స్టాక్ మార్కెట్ | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 81,159.68 |
| నిఫ్టీ ↗ | 24,890.85 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.4 | 162 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.4 | 162 |
| రిటైల్ గుడ్డు ధర | 5.72 | 171.72 |

## టెన్షన్.. టెన్షన్


- హైకోర్టులో ఏం జరుగుతుంది?
- పల్లెల్లో కనబడడని జోరు
- రిజర్వేషన్ల గందరగోళంతో నేతల్లో కనపడని ఉత్సాహం

02



### నన్ను ఏదైనా చేయండి.. వారిని ఇబ్బంది పెట్టొద్దు
సీఎంకు టీవీకే అధినేత విజయ్ రిక్వెస్ట్

వివరాలు 2లో

## త్వరలో అన్నీ బయటపెడతా..
- ఆదిత్య వింటేజ్ నిర్మాణంపై ఏ గద్ద వాలింది.. సూట్ కేసులేవీ?
- సూట్ కేసులు అందుకుంటున్న మంత్రులు ఎవరో సీఎం విచారించాలి
- బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. నర్సింగ్ పోలీస్ స్టేషన్ ఎదురుగా సర్వీస్ రోడ్డును మింగి ఆదిత్య వింటేజ్ భారీ భవనం నిర్మిస్తున్నారని ఎంపీ రఘునందన్ రావు ఫైర్ అయ్యారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... అడ్డగోలుగా ఆదిత్య వింటేజ్

మిగతా 2లో





# స్థానిక పరీక్ష

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యంగా పని చేయాలని మంత్రులకు సీఎం సూచించారు. ఓ పక్క ఎన్నికల నిర్వహణపై అనుమానాలు నెలకొన్న తరుణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో సమీక్షించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కోర్టు తీర్పు ఎలా ఉన్నా.. పార్టీ శ్రేణులు ఎన్నికలకు సమాయత్తం కావాలని సూచించినట్లు సమాచారం. గ్రూప్ 1 ఫలితాలు, నియామకాలు, గ్రూప్ 2 ఫలితాలు, బతుకమ్మ పండుగ నిర్వహణ, ఫ్యూచర్ సిటీ శంఖుస్థాపన కార్యక్రమాలు, సిటీ చుట్టూ పలు కార్యక్రమాల శ్రీకారం, టూరిజం కాంక్లేవ్ వంటి కార్యక్రమాలతో పాజిటివ్ వాతావరణం ఉందన్న అభిప్రాయం ప్రభుత్వవర్గాల్లో ఉంది.

**పొన్నం నివాసంలో కీలక భేటీ**

మినిస్టర్ క్వార్టర్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో బీసీ నేతలు కీలక సమావేశం నిర్వహించారు. సమావేశంలో పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, సీనియర్ నాయకులు వి. హనుమంతరావు, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, మినరల్స్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాల పై చర్చ జరిగింది. 8 వ తేది నాడు కోర్టులో రిజర్వేషన్ల అంశంపై గెలిచి తీరుతామని నేతలు అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్తున్నామని, తమిళనాడు లో తరహాలో ఇక్కడ కూడా రిజర్వేషన్లు అమలు అవుతాయని ధీమా వ్యక్తం చేశారు.

# బీసీ రిజర్వేషన్లపై మోదీని అడిగే దమ్ము ఉందా?

## ఈటల, బండి సంజయ్, అరవింద్‌కు పీసీసీ చీఫ్ ఛాలెంజ్

- బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే.. రెండు పార్టీలు కలిసే సంసారం చేస్తున్నాయి
- దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా బీఆర్ఎస్ బాకీ కార్డు ప్రచారం
- నిరుద్యోగుల కలలు సాకారం చేస్తే బాకీ పడ్డట్టా.. రైతు భరోసా ఇస్తే బాకీ పడ్డట్టా?
- ప్రతిపక్షాలపై టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్



బీసీల నోటి కాడా ముద్ద లాక్కునే ప్రయత్నం బీజేపీ చేస్తోందని దేశంలో ఎక్కడ లేని విధంగా కుల సర్వే నిర్వహించామన్నారు. బీసీ రిజర్వేషన్ల గురించి అర్హత బీజేపీ నేతలకు లేదని పార్టీలకు అతీతంగా బీసీ రిజర్వేషన్లకు మద్దతు ఇవ్వాలన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం బీజేపీ నేతలు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టు తీర్పు సానుకూలంగా వస్తుందని ఆశిస్తున్నామన్నారు.

**హైదరాబాద్, మహా:** ప్రతిపక్షాలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట ఇస్తే నిలుపుకోవడం కాంగ్రెస్‌కే సాధ్యమని బీసీ రిజర్వేషన్లతో మరోసారి నిరూపితమైందని అన్నారు. బీసీ రిజర్వేషనులు కాంగ్రెస్ పార్టీ కమిట్మెంట్ అని చెప్పారు. మంగళవారం గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనని ఈ రెండు పార్టీలు కలిసే సంసారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై కుట్ర పూరితంగా కాంగ్రెస్‌పై విష ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. కాళేశ్వరం, ఫార్ములా ఈ కార్ రేస్ తో పాటు బీఆర్ఎస్ హయాంలో జరిగిన స్కామ్ ల బండారం ఒక్కొక్కటి బయట పడుతుండడంతో దిక్కుతోచక 'బాకీ కార్డు' పేరుతో మోసపూరిత ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణకు బీఆర్ఎస్ చేసిన బాకీకి మేము వడ్డీలు కడుతున్నామని బకాయిల గురించి మాట్లాడితే మొదటి ముద్దాయి కేసిఆర్ అవుతారన్నారు. బీఆర్ఎస్ 'బాకీ కార్డు' ప్రచారం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టు ఉందని దీన్ని చూసి జనాలు నవ్వుకుంటున్నారన్నారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పల రాష్ట్రంగా మార్చిన బీఆర్ఎస్ కు బాకీ అనే పదం కూడా ఎత్తే అర్హత లేదన్నారు. నిరుద్యోగుల కలలు సాకారం చేస్తే బాకీ పడ్డట్టా? రైతు భరోసా ఇస్తే బాకీ పడ్డట్టా? రూ.500 సబ్సిడీతో గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచడం బకాయి పడ్డట్టా? అని ప్రశ్నించారు.

**జీఎస్టీ పేరుతో వేల కోట్లు కేంద్రం..**

ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేయడం, రైతు భరోసా ఇవ్వడం, వరికి బోనస్ ఇవ్వడం బకాయి పడ్డట్టా? రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం బకాయి పడ్డట్టా? అని నిలదీశారు. ప్రతి ఇంటికి ఒక ప్రభుత్వ ఉద్యోగం అని చెప్పి ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారు? ఎంతమందికి దళిత బంధు ఇచ్చారు? అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడం బకాయి పడడమా? బీఆర్ఎస్ ప్రచారం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలన నవాబు పాలన అని తెలంగాణను సర్వ నాశనం చేసింది బీఆర్ఎస్ అని విమర్శించారు. ఎరువుల పేరిట కేంద్రంలోని బీజేపీ మోసం చేస్తోందని, జీఎస్టీ పేరుతో వేల కోట్లు కేంద్రంలోని బీజేపీ దోచుకుందన్నారు. ప్రజల మనసులో కాంగ్రెస్ పార్టీ ఉందని స్థానిక సంస్థలో ఎన్నికల్లో 80 శాతం పైగా సీట్లు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోడీని అడిగే దమ్ము ఈటల, బండి సంజయ్, అరవింద్ కు లేదా అని ప్రశ్నించారు. ఈటల రాజేందర్ కు సూటీ ప్రశ్నగా ప్రశ్నిస్తున్నా బీసీ బిల్లులు గురించి మాట్లాడరా అని నిలదీశారు.

# టీసీఎస్ నుంచి 80 వేల మంది ఔట్

**మహా:** భారతదేశంలో అతిపెద్ద టెక్ కంపెనీ టీసీఎస్. ఇందులో జాబ్ కొడితే లైఫ్ సెట్ అయిందని సంతోష పడేవాళ్ళు. కానీ ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిణామాలు ఉద్యోగాలను తల్లకిందులు చేస్తున్నాయి. కార్పొరేట్ కంపెనీలు తమకు అక్కర్లేదు అనుకుంటే క్షణాల్లో ఉద్యోగులను పీకేస్తాయి . టీసీఎస్ అధికారిక లెక్కల ప్రకారం లేఆఫ్స్ కింద కేవలం 12వేల మందిని మాత్రమే తొలగించినట్లు చెబుతున్నప్పటికీ ఉద్యోగులు మాత్రం ఈ సంఖ్య 80వేల వరకు ఉందని అంటున్నారు. యాక్సెంచర్ కూడా 11వేల ఉద్యోగులను తగ్గించింది.

# కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సీఎం చంద్రబాబు కీలక భేటీ

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రానికి ఆర్థిక సాయం సహా పలు అంశాలపై ఆయనతో చర్చించారు. ఏపీకి అండగా నిలుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలో ధ్వంసమైన ఆర్థికవ్యవస్థను కేంద్రం అండతో పునరుద్ధరిస్తున్నామని అమిత్‌షాకు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తరఫున మరింత సహకారం అందించాలని చంద్రబాబు కోరారు. సీఎంతో పాటు భేటీకి కేంద్ర మంత్రుల రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని హాజరయ్యారు.

# సర్పంచ్ ఎన్నికలు ఇప్పుడే జరగవు!

(మొదటిపేజీ తరువాయి)

కోర్టులో చెల్లదని తెలిసికూడా బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటించి.. గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. బిహార్, మహారాష్ట్రలో రిజర్వేషన్లపై నమోదైన పలు కేసులను సుప్రీం కోర్టు కొట్టివేసిందన్నారు. ఎవరూ కోర్టుకు వెళ్లొద్దని ముగ్గురు మంత్రులు చెబుతున్నారని గుర్తు చేశారు. 'కోర్టుకు వెళ్తే అభ్యంతరం ఏంటని నేను ప్రశ్నిస్తున్నా. ఎన్నికల్లో ఓటు కోసం డబ్బులు ఖర్చుపెట్టొద్దని రాష్ట్ర ఎన్నికల కమిషన్ చెబుతోంది. నల్గొండ జిల్లాలోని గిరిజన తండాల్లో బీసీలు లేకున్నా.. రిజర్వేషన్ ప్రకటించారు. మా పార్టీ తరఫున శాసనసభలో, కౌన్సిల్‌లో పూర్తి మద్దతిచ్చాం. అనుభవం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది. మా మీద అనవసరంగా బురద చల్లొద్దు' అని ఈటల అన్నారు.

# ముగిసిన వర్షా కాలం

## ఈ ఏడాది 8 శాతం ఎక్కువ వానలు: ఐఎండీ వెల్లడి

**మహా :** దేశంలో 4 నెలల రుతుపవన కాలం నేటితో ముగిసింది. ఈ సీజన్‌లో సాధారణం కన్నా 8 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. మేఘ విస్ఫోటనాలు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పటికీ ఈ రుతుపవనకాలం విజయవంతమైందని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మొహపాత్ర తెలిపారు. రుతుపన కాలం ముగిసినప్పటికీ, ఇకపైనా దేశవ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. ముఖ్యంగా వాయువ్యంలోని కొన్ని ప్రాంతాలు మినహా, భారతదేశంలోని చాలా ప్రాంతాల్లో అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వర్షాలు సాధారణం కంటే ఎక్కువ కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

### దేశంలో వర్షపాతం

సాధారణంగా మన భారతదేశంలో వర్షాకాలంలో 868.6 మి.మీ వర్షం కురవాలి. కానీ ఈ ఏడాది ఏకంగా 937.2 మి.మీ వర్షపాతం కురిసింది. అంటే 8 శాతం ఎక్కువగా వర్షాలు కురిశాయి. ఇక తూర్పు, ఈశాన్య భారతదేశాల విషయానికి వస్తే ఈ ఏడాది 1089.9 మి.మీ వర్షం కురిసింది. ఇది సాధారణంగా ఆ ప్రాంతంలో కురిసే (1367.3 మి.మీ) వర్షపాతం కంటే 20 శాతం తక్కువ కావడం గమనార్హం. ఇక బిహార్, అరుణాచల్‌ప్రదేశ్, అసోం, మేఘాలయల్లో లోటు వర్షపాతం నమోదైంది. 1901వ సంవత్సరం తరువాత తూర్పు, ఈశాన్య భారతదేశాల్లో రెండో అత్యల్ప వర్షపాతం నమోదు అయ్యింది. 2013లో ఇక్కడ అత్యల్ప వర్షపాతం (1065.7 మి.మీ) కురిసింది. ముఖ్యంగా 2020 నుంచి ఈ ప్రాంతంలో వర్షపాతం క్రమంగా తగ్గుతున్న ధోరణి కనిపిస్తోంది. మొత్తంగా చూసుకుంటే ఈ ప్రాంతంలో గత 20 ఏళ్లలో వర్షపాతం తగ్గుతోందని అధ్యయనాలు కూడా చూపిస్తున్నాయి. వాయువ్య భారతదేశంలో ఈ ఏడాది 747.9 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇది సాధారణం 587.6 మి.మీ కంటే 27.3 శాతం ఎక్కువ. ఈ ప్రాంతంలో 2001 తర్వాత ఇది అత్యధికం. 1901 నుంచి చూసుకుంటే ఇది ఆరో అత్యధిక వర్షపాతం. వాయువ్య భారతదేశంలోని అన్ని జిల్లాల్లో జూన్, ఆగస్టు, సెప్టెంబర్‌లలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అయ్యింది. మధ్య భారతదేశంలో ఈ నాలుగు నెలల్లో 1125.3 మి.మీ వర్షపాతం నమోదు అయ్యింది. ఇది సాధారణం (978 మి.మీ) కంటే 15.1 శాతం ఎక్కువ. ఇక దక్షిణ ద్వీపకల్పంలో సాధారణం (716.2 మి.మీ) కంటే 9.9 శాతం ఎక్కువ వర్షపాతం నమోదు అయ్యింది.

# టెన్షన్.. టెన్షన్

- హైకోర్టులో ఏం జరుగుతుంది?.. పల్లెల్లో కనబడని జోరు
- రిజర్వేషన్ల గందరగోళంతో నేతల్లో కనపడని ఉత్సాహం

**హైదరాబాద్, మహా:** ఓ వైపు షెడ్యూల్ రిలీజ్ అయినా.. స్థానిక ఎన్నికలపై మాత్రం టెన్షన్ కనబడుతోంది. పల్లెల్లో ఆ వాతావరణమే కనిపించడం లేదు. తెలంగాణలో స్థానిక ఎన్నికలకు ఈసీ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 9 నుంచి తొలివిడత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు.. అక్టోబర్ 17 నుంచి పంచాయతీ ఎన్నికల నామినేషన్లను స్వీకరించనున్నారు. ఇప్పటికే రిజర్వేషన్లను ప్రకటించడంతో అభ్యర్థులను ఖరారు చేయడంపై ప్రధాన పార్టీలు ఫోకస్ పెట్టాయి. వాస్తవానికి ఓ వైపు దసరా, మరో వైపు స్థానిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి జోరుగా ఉండాలి. కానీ పల్లెల్లో మాత్రం ఆ వాతావరణం పెద్దగా కనిపించడం లేదు. బీసీ రిజర్వేషన్లను పెంచుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో చెల్లదంటూ పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, ఆ పిటిషన్ పై విచారణ చేపట్టిన న్యాయస్థానం తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది.

**ఎందుకు డౌట్**

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టానికి గవర్నర్ ఆమోదం లభించలేదు. పాత పంచాయతీ రాజ్ చట్ట సవరణకు కూడా గ్రీన్ సిగ్నల్ రాలేదు. ఈ రెండు అంశాలు పెండింగ్ లో ఉన్న సమయంలో తీసుకువచ్చిన జీవో చెల్లదన్న చర్చ జోరుగా సాగుతోంది. మొన్న కోర్టు కూడా ఇదే అంశాలపై ప్రభుత్వ తరఫు న్యాయవాదులను ప్రశ్నించింది. బీజేపీ కీలక నేత, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ కూడా అభ్యర్థులు తొందరపడి ఖర్చు పెట్టొద్దని.. ఆగం కావొద్దని ఇప్పటికే హెచ్చరించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో న్యాయ సమీక్షకు నిలబడదన్నారు. దీంతో ఏం చేయాలో తెలియక ఆశావహులు తలలు పట్టుకుంటున్నారు. రిజర్వేషన్ కలిసి వచ్చిందని సంతోష పడి గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టాలా? లేక 8న కోర్టు కేసు తేలే వరకు ఆగాలా? అన్న విషయం అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

**మహారాష్ట్రలో కొట్టేసినట్లే**

గతంలో మహారాష్ట్రలో రిజర్వేషన్లు పెంచి నిర్వహించిన స్థానిక ఎన్నికలను కోర్టు రద్దు చేసిన అంశంపై ఇప్పుడు తెలంగాణలో జోరుగా చర్చ సాగుతోంది. ఒక వేళ ఎన్నికలు జరిగినా రద్దు ఖాయమన్న ప్రచారం సోషల్ మీడియాలో హోరెత్తుతోంది. దీంతో ఆశావహుల్లో ఆందోళన డబుల్ అవుతోంది. రిజర్వేషన్లు కలిసి వచ్చినా.. ఆనందం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 69శాతం రిజర్వేషన్లతో జనరల్ అభ్యర్థులు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. రిజర్వేషన్ల పెంపు పై ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో పై అక్టోబర్ 8న హైకోర్టు విచారణ చేపట్టనుంది. అయితే.. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత న్యాయస్థానం ఎన్నికలపై స్టే ఇవ్వడం లేదా పిటిషన్ ను కొట్టివేసే ఛాన్స్ ఉంది. ఈ రెండు చేయకుండా విచారణను వాయిదే వేసే అవకాశం కూడా ఉంది. మొదటి రెండు ఆప్షన్లలో కోర్టు ఏ నిర్ణయం తీసుకుంటే స్థానిక ఎన్నికలపై కాస్త క్లారిటీ వచ్చే ఛాన్స్ ఉంది. స్టే ఇస్తే ఎన్నికలు ఆగుతాయి. అలా కాకుండా పిటిషన్ కొట్టి వేస్తే ఎన్నికలు సజావుగా జరిగే అవకాశం ఉంటుంది. లేదా జీవోను కొట్టివేస్తే.. మళ్ళీ రిజర్వేషన్ల కథ మొదటికొస్తుంది.



# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తుది ఓటర్ల జాబితా విడుదల

## మొత్తం ఓటర్లు 3,99,000

ముఖ్య ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** రాబోయే జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికకు సంబంధించిన తుది ఓటర్ల జాబితా విడుదలైంది. ఈ జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,99,000గా ఉందని ముఖ్య ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి మంగళవారం ప్రకటించారు. జూలై 1, 2025ను అర్హత తేదీగా తీసుకుని సవరించిన జాబితాలో 2,07,382 మంది పురుషులు, 1,91,593 మంది మహిళలు, 25 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. లింగ నిష్పత్తి ప్రతి వెయ్యి పురుషులకు 924 మహిళలుగా ఉంది. ఈ జాబితాలో 6,106 మంది యువ ఓటర్లు (18-19 సంవత్సరాలు), 2,613 మంది వృద్ధులు (80 ఏళ్లు పైబడిన వారు), అలాగే 1,891 మంది వికలాంగులు ఉన్నారు. వీరిలో 519 మంది చూపు కోల్పోయిన వారు, 667 మంది కదలికల లోపం ఉన్న వారు, 311 మంది వినికిడి/మాట లోపం కలిగిన వారు, మిగతా 722 మంది ఇతర కేటగిరీలకు చెందినవారు. విదేశీ ఓటర్లు 95 మంది ఉన్నారు. సెప్టెంబర్ 2న విడుదలైన ప్రాథమిక జాబితాలో 3,92,669 ఓటర్లు ఉన్నారు. నిరంతర సవరణల తరువాత 6,976 మంది కొత్తగా చేర్చబడ్డారు, 663 మంది తొలగించబడ్డారు. దీంతో మొత్తం సంఖ్య 3,98,982కి చేరింది. సేవా ఓటర్లను కలుపుకుని తుది సంఖ్య 3,99,000గా నమోదైంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉపఎన్నిక నిర్వహణకు 139 కేంద్రాల్లో 407 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

# త్వరలో అన్నీ బయటపెడతా..



(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణాలు చేపడుతున్నారని.. సర్వీస్ రోడ్డు లేకుండా నిర్మాణం చేస్తుంటే ఎలా అనుమతి వచ్చిందని ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణం జరుగుతోందన్నారు. ఎవరి ప్రమేయంతో ఈ నిర్మాణాలు చేస్తున్నారని నిలదీశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాస్తున్నట్లు తెలిపారు. అలాగే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కాపీ పంపుతానని ఎంపీ చెప్పారు. పేదోడి ఇండ్లను అడ్డగోలుగా కూలగొడుతున్నారని... పెద్దలకు ఎలా అనుమతులు ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డికి చిత్త శుద్ధి ఉంటే ఈ నిర్మాణాన్ని ఆపాలన్నారు.

### సూట్ కేసులు అందుకుంటున్న మంత్రులెవరు?

నిర్మాణం ఆపకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని రఘునందన్ రావు హెచ్చరించారు. హెచ్ఎండీఏ అధికారులే కేసులు వేస్తారని.. మళ్లీ వారే అనుమతి ఇస్తారని విమర్శించారు. ఈ నిర్మాణ అనుమతులలో సీఎం రేవంత్ రెడ్డి ఇన్వాల్వ్ అయ్యారా.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇన్వాల్వ్ అయ్యారా అని ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, హద్దులు తొలగించారని క్రిమినల్ కేసులు నమోదు చేశారని.. ఈ నిర్మాణంలో సూట్ కేసులు అందుకుంటున్న మంత్రులు ఎవరో సీఎం రేవంత్ రెడ్డి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. 'టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నీతి వాఖ్యలు చెబుతుంటారు.. అందుకే ఆయనకు చెబుతున్నాను.. మంత్రుల మీద చర్యలు తీసుకోమని ఏఐసీసీకి లేఖ రాయండి' అంటూ హితవుపలికారు. వంద శాతం అవినీతి జరిగిందని.. అక్రమ నిర్మాణం జరిగిందని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.

# అంబరాన్ని తాకిన బతుకమ్మ సంబరాలు

వేడుకలకు పీసీసీ చీఫ్ మహేష్. మంత్రులు, పొన్నం, జూపల్లి, సీతక్క, కొండా సురేఖ, ఆకట్టుకున్న బతుకమ్మ లేజర్ లైట్ షో



**హైదరాబాద్, మహా :** సద్దుల బతుకమ్మ సంబరాలు మంగళవారం అంబరాన్నంటాయి. ట్యాంక్ బండ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేడుకగా బతుకమ్మ సంబరాలు ముగిశాయి. వేలాది మహిళలు ట్యాంక్‌బండ్‌కు చేరుకుని బతుకమ్మ సంబరాల్లో పాలుపంచుకున్నారు. తీరొక్క పూలతో మహిళలు వేడుకలు చేసుకున్నారు. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. బతుకమ్మలతో అమరుల స్థూపం దగ్గర తొలిపూజ చేశారు. అమరుల స్థూపం నుంచి ట్యాంక్ బండ్ బతుకమ్మ ఘాట్ వరకు 700 బతుకమ్మలతో ఊరేగింపు నిర్వహించారు. ముఖ్యంగా 500 మంది కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డప్పుల సౌండ్‌లతో బతుకమ్మ ఆటపాటలతో ట్యాంక్ బండ్ పరిసరాలు మారుమోగిపోయాయి. అంతేకాకుండా బతుకమ్మ లేజర్ లైట్ షో ఆకట్టుకుంది. ఈ బతుకమ్మ వేడుకలకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మంత్రి కొండా సురేఖ, మంత్రి సీతక్క, ఎంపీ అనిల్ యాదవ్, ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి తాను బతుకమ్మ ఆడుతున్నానని. ఇది చరిత్రలో నిలిచిపోయే బతుకమ్మ అని అన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ప్రజాప్రభుత్వంలో ఏర్పాటు చేసుకున్న బతుకమ్మ అన్నారు. గిన్నిస్ బుక్‌లో మన బతుకమ్మను ఎక్కించాలనే తపనతో మన బతుకమ్మను ప్రపంచవ్యాప్తం చేశామన్నారు. ఇందుకోసం పాటుపడిన ప్రతి ఒక్కరికీ పత్యేక అభినందనలు తెలిపారు. పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి మనదని, ప్రపంచంలో ఎక్కడా ఇలా జరగదని, తొమ్మిది రోజులు ఎంతో సంతోషంగా మహిళలు ఈ పండుగను జరుపుకున్నారని తెలిపారు. ఇప్పటి యువత వెస్ట్రన్ కల్చర్‌లో బతుకమ్మ జరుపుకోవద్దని మన సాంప్రదాయాలకు అనుగుణంగా పండుగ జరుపుకోవాలని సూచించారు.

# నన్ను ఏదైనా చేయండి.. వారిని ఇబ్బందిపెట్టొద్దు

## సీఎంకు టీవీకే అధినేత విజయ్ రిక్వెస్ట్



**తమిళనాడు, మహా:** 'సీఎం సర్.. మీరు నాపై కక్ష తీర్చుకోవాలంటే..నన్ను ఏదైనా చేయండి.నేను ఇంట్లో కానీ, ఆఫీస్‌లో కానీ ఉంటాను. నా ప్రజల జోలికి వెళ్లకండి. నేనేం తప్పు చేయలేదు. నా రాజకీయ జీవితం మరింత ఉత్సాహంతో కొనసాగుతుంది' అని సినీ నటుడు, టీవీకే పార్టీ చీఫ్ విజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కరూర్ ప్రచార సభలో జరిగిన తొక్కిసలాట ఘటనపై స్పందిస్తూ వీడియో రిలీజ్ చేశారు. నా జీవితంలో ఇలాంటి బాధ ఎన్నడూ పడలేదు. నా హృదయం బాధతో విలవిల్లాడుతోంది. ప్రచారంలో నన్ను చూసేందుకు జనం వచ్చారు. నాపై వారు చూపుతున్న ప్రేమకు నేను ఎప్పుడూ కృతజ్ఞతతో ఉంటాను. అలాగే వారి భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదు. రాజకీయాలను పక్కనపెట్టి ప్రజలకు సురక్షితమైన ప్రాంతంలో సభ జరగాలనే నేను కోరుకున్నాను. అదే విషయమై పోలీసు శాఖను అభ్యర్థించాను. కానీ జరగకూడనిది జరిగింది. అంతకుముందు మేం ఐదు జిల్లాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించాం. కానీ ఒక్క కరూర్‌లోనే ఎందుకు ఇలా జరిగింది. ప్రజలకు నిజం తెలుసు. వారంతా చూస్తున్నారు. నేను కూడా మనిషినే. ఉద్రిక్త పరిస్థితులకు దారితీస్తుందనే నేను అక్కడ పర్యటించలేదు. త్వరలోనే వారిని కలుస్తా. కరూర్ ప్రజలు నిజాలు మాట్లాడినప్పుడు దేవుడే అలా మాట్లాడిస్తున్నట్లు అనిపించింది. తర్వలో అన్ని నిజాలు బయటకువస్తాయి. మేం ఎలాంటి తప్పులు చేయకపోయినా.. పార్టీ నాయకులు, స్నేహితులు, సోషల్ మీడియా వినియోగదారుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు'' అని తన వీడియో సందేశంలో పేర్కొన్నారు.

# తెలంగాణ తల్లి ఫ్లైఓవర్

- తెలుగుతల్లి ఫ్లై ఓవర్ పేరు మార్చుతూ బోర్డు
- సీఎం రేవంత్ పై నెటిజన్ల ప్రశంసలు

**హైదరాబాద్, మహా:** జీహెచ్ఎంసీ పరిధిలోని తెలుగు తల్లి ఫ్లై ఓవర్ పేరును తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్‌గా మారుస్తూ ఫ్లై ఓవర్ కోసం ఆర్చ్‌ను ఏర్పాటు చేసింది. బ్రిడ్జికి ఇరువైపులా ఆర్చ్ నిర్మించింది. దీంతో నెటిజన్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ప్రశఃసలు కురిపిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో సచివాలయం దగ్గర తీవ్రమైన ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు 2005లో బ్రిడ్జి నిర్మించారు. సచివాలయం నుంచి లోయర్ ట్యాంక్ బండ్ వరకు నిర్మించిన ఈ బ్రిడ్జ్ ప్రారంభోత్సవ సమయంలో తెలుగు తల్లి ఫ్లై ఓవర్ అని పేరు పెట్టారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రస్తుతం ఉన్న తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌ను తెలంగాణ తల్లి ఫ్లై ఓవర్‌గా మార్చాలని నిర్ణయించారు. జీహెచ్ ఎంసీ మేయర్ విజయ లక్ష్మి అధ్యక్షత జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో తెలుగు తల్లి ఫ్లై ఓవర్ పేరును తెలంగాణ తల్లి ఫ్లైఓబర్ గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. సీఎం రేవంత్ సూచనతో ఈ నిర్ణయం తీసుకున్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుచేయడంతో పాటు పలు కీలక నిర్ణయాలు సీఎం రేవంత్ తీసుకున్నారు.

## పెద్దమ్మతల్లిని దర్శించుకున్న కేటీఆర్ దంపతులు



**జూబ్లీహిల్స్, మహా :** జూబ్లీహిల్స్‌లోని ప్రసిద్ధ పెద్దమ్మతల్లి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు దంపతులు మంగళవారం ఆలయాన్ని సందర్శించారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి ఆహ్వానం మేరకు ఆలయానికి విచ్చేసిన కేటీఆర్ దంపతులు, పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం, ఆలయ అర్చకులు కేటీఆర్ దంపతులను ఆశీర్వదించి, వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

## త్వరగా రిప్లై ఇవ్వండి..

### యుద్ధాన్ని ఆపకపోతే విషాదాంతమే..

### హమాస్‌కు అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం



**ఇంటర్నెట్ డెస్క్, మహా:** గాజాలో యుద్ధం ముగింపునకు తాము సూచించిన శాంతి ఫార్ములాపై హమాస్ స్పందన తెలియజేసేందుకు మూడు, నాలుగు రోజులు గడువు ఇస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. లేదంటే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ ఒప్పందానికి అంగీకరించకుంటే ముగింపు విషాదంగా ఉంటుందని హెచ్చరించారు. ఇదే అంశంపై వైట్‌హౌస్ బయట మీడియాతో మాట్లాడారు. 'ఈ ప్రతిపాదనపై భాగస్వామ్య పక్షాలన్నీ స్పందించాయి. ఇజ్రాయెల్ సహా అరబ్ దేశాలు అంగీకరించాయి. ముస్లిం దేశాలు కూడా ఓకే చెప్పాయి. హమాస్ స్పందన కోసం వేచి చూస్తున్నాం. వారు అంగీకరిస్తారో లేదో తెలియదు. మూడునాలుగు రోజులు వేచి చూద్దాం. ఒకవేళ అంగీకరించకుంటే ముగింపు చాలా విషాదంగా ఉంటుంది. ఇజ్రాయెల్ ఏం చేయాలో అది చేస్తుంది' అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. కాల్పుల విరమణగా పేర్కొంటున్న ఈ శాంతి ఒప్పందం ప్రకారం.. 72 గంటల్లో బందీలను హమాస్ విడిచిపెట్టాలి. ఇజ్రాయెల్ కూడా క్రమంగా గాజా నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకునేలా ప్రతిపాదనలు చేశారు. అయితే, దీనిపై హమాస్ చర్చలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. రాజకీయ, సైనిక నాయకత్వంతో సంప్రదింపులు ప్రారంభించినట్లు వార్తలు వస్తున్నాయి.

## రాష్ట్రానికి గర్వకారణం

### బతుకమ్మకు గిన్నిస్ రికార్డులపై సీఎం రేవంత్ హర్షం



**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, టూరిజం డిపార్ట్మెంట్ ఎండీ క్రాంతి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బతుకమ్మ కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిన నేపథ్యంలో మంత్రి జూపల్లి, ఉన్నతాధికారులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద బతుకమ్మ 63 ఫీట్ల 11 అంగుళాల ఎత్తు, 11 అడుగుల వెడల్పు. 7 టన్నుల బరువుతో తయారు చేసిన బతుకమ్మలో 11 లేయర్లు, 9 రకాల పూవులను వినియోగించారు. అలాగే 1354 మంది మహిళలు ఒకేసారి లయబద్ధంగా బతుకమ్మ పాటకలు పాడుతూ.. నృత్యం చేయడం ద్వార రెండు కేటగిరీల్లో మన బతుకమ్మ గిన్నిస్ రికార్డు సృష్టించింది.

## సీజనల్ కేసులు లేని తెలంగాణే లక్ష్యం

- ముందస్తు నివారణ చర్యల వల్ల కేసుల సంఖ్య తగ్గుముఖం
- సీజనల్ వ్యాధుల నివారణపై ఏర్పాటు చేసిన సమీక్షలో మంత్రి దామోదర రాజనర్సింహ



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం సీజనల్ వ్యాధుల నివారణపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నివారణపై ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రదర్శనను ఆయన పరిశీలించారు. సీజనల్ వ్యాధులు పూర్తి నియంత్రణలో ఉన్నాయని ఆరోగ్య శాఖ అధికారులు మంత్రికి వివరించారు. గత సంవత్సరంతో పోలిస్తే సీజనల్ వ్యాధుల కేసులు తగ్గుముఖం పట్టాయని సమీక్షలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డా. రవీందర్ కుమార్ వెల్లడించారు. రాష్ట్రంలో ప్రజారోగ్య శాఖ సీజనల్ వ్యాధుల నిర్మూలనలో ముందస్తు నివారణ చర్యలు చేపట్టడం వల్ల కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టాయని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. సీజనల్ వ్యాధుల కట్టడిపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల్లో అవగాహనను కల్పించామని వెల్లడించారు. సీజనల్ కేసులు నమోదు రహిత రాష్ట్రంగా తెలంగాణ తీర్చిదిద్దాలని ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని ఆసుపత్రుల్లో సీజనల్ రోగాలకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర వైద్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డా. క్రిస్టినా జడ్ చోంగ్తూ, ఆరోగ్య శ్రీ ట్రస్ట్ సీఈఓ ఉదయ్ కుమార్, డీఎంఈ డా . నరేంద్ర కుమార్, డైరెక్టర్ అఫ్ హెల్త్ డా . రవీందర్ కుమార్ , టీవీవీపీ కమిషనర్ డా. అజయ్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ విమలా థామస్ లు పాల్గొన్నారు.

## అమెరికాలో జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో బహుమతులు



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ఆడపడుచులు విదేశాల్లో బతుకమ్మ రీలు చేసి మొదటి బహుమతి పొందిన సంఘటన చోటుచేసుకుంది. బెల్లంపల్లి పట్టణానికి చెందిన మహిళలు అమెరికా దేశంలో స్థిరపడినప్పటికీ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ఆలవాలంగా నిలిచే బతుకమ్మ సద్దుల వేడుకలను ఘనంగా నిర్వహించడంతో మొదటి బహుమతి సాధించడం విశేషం. బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఆవుల స్రవంతి, రామగోని స్రవంతి, బుర్ర ఉమామహేశ్వర్ లు ప్రత్యేక రీతిలో సద్దుల బతుకమ్మను పేర్చి బహుమతి సాధించడంతో తెలంగాణణ డెవలప్ మెంట్ ఫోరం డిసీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత చల్ల చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో పవిత్రంగా, ప్రత్యేకంగా భక్తిశ్రద్ధలతో తెలంగాణ ఆడపడుచులు, సంవత్సరానికి ఒకసారి ఆడుకునే బతుకమ్మ ఆటకు, తెలంగాణలోనే కాకుండా విదేశాల్లోనూ ఆదరణ ఉందని తెలంగాణ డెవలప్మెంట్ ఫోరం డిసి 25 వ వార్షికోత్సవం సందర్భంగా వాషింగ్టన్ డిసి వర్జీనీయాలో ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. 20 వ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న బెల్లంపల్లికి చెందిన ఆవుల స్రవంతి, రామగోని స్రవంతి, బుర్ర ఉమామహేశ్వరి బతుకమ్మ ఆటాపాటల్లో పాల్గొని మొదటి బహుమతి గెలుచుకున్నారు.

## కాంగ్రెస్ పాలనలోనే గ్రూప్1 నియామకాలు

- పదేళ్లలో నిరుద్యోగుల కలలు కలలుగానే మిగిలాయి
- నేడు ప్రజా పాలనలో నిజమవుతున్నాయి
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్:** ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు కన్న కలలు గడచిన పది సంవత్సరాలలో కలలుగానే మిగిలాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం వారి కలలను నిజం చేస్తోందన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రూప్ 1 నియామకాల్లో ఎంపికై స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖలో జిల్లా రిజిస్ట్రార్‌లుగా నియమితులైన పలువురు అభ్యర్థులు మంగళవారం సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించారు. ప్రజా ప్రభుత్వం అనేక కార్యక్రమాలతో ముందుకు వెళుతోందని, ఈ కీలక సమయంలో కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న అభ్యర్థులపై గురుతరమైన బాధ్యత ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో 2011 లో గ్రూప్ 1 కు నోటిఫికేషన్ జారీ చేయగా, 2018 లో భర్తీ ప్రక్రియ పూర్తయిందని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ 1 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్‌లు జారీ చేస్తే మీరేంది భర్తీ చేసేది, తెలంగాణ సాధించుకున్నతర్వాత స్వరాష్ట్రంలో మా ఉద్యోగాలను మేమే భర్తీ చేసుకుంటామని నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించి అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తని ఆ పార్టీ నాయకులు ఈ రోజు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం శోచనీయమన్నారు ఉద్యోగాలు ఇవ్వాలన్నా , పేదలకు అండగా ఉండాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వాలతోనే సాధ్యమని తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా గ్రూప్1 పోస్టులు భర్తీ చేసి ప్రజాప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు.
ఉమ్మడి రాష్ట్రంలోనూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలోనూ గ్రూప్1 పరీక్షలు నిర్వహించి నియామకాలు జరిపిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో క్రమం తప్పకుండా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ 1 నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేసేవారని ఏ ఉద్యోగిని అడిగినా ఫలాన సంవత్సరంలో నియమితులయ్యామని చెప్పేవారు. కానీ దురదృష్టవశాత్తూ గడచిన పదేళ్లలో ఒక్క గ్రూప్1 ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాల భర్తీకి సంబంధించిన టిజిపిఎస్సీని పూర్తిగా నిర్వీర్యం చేశారని, ఈ దశలో అధికారంలోకి వచ్చిన తమ ప్రభుత్వం టిజిపిఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేసి గ్రూప్1, గ్రూప్2 నోటిఫికేషన్లు జారీ చేయడమేకాకుండా ఉద్యోగాలను కూడా భర్తీ చేస్తోందని అన్నారు. ఏడాదిన్నరలోనే దాదాపు 60 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. ఇది చూసి ఓర్వలేని కొంతమంది ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖను ఒక ఆదాయ వనరుగానే చూసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఎన్నో సంస్కరణలు తీసుకురావడం జరిగిందన్నారు. ప్రజల సమయాన్ని ఆదా చేసేలా స్లాట్ బుకింగ్ విధానాన్ని తీసుకువచ్చామని కార్పోరేట్‌కు ధీటుగా అత్యంత ఆధునిక వసతులతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకొని అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఆలోచనలకు ఆకాంక్షలకు అనుగుణంగా నిజాయితీతో నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రభుత్వ పేరు ప్రతిష్ఠలను పెంచాలని ఈ సందర్భంగా కొత్తగా నియమితులైన జిల్లా రిజిస్ట్రార్‌లకు మంత్రి సూచించారు.

## సజ్జనార్ ఆన్ డ్యూటీ!

- నగర నూతన సీపీగా బాధ్యతలు
- డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం
- మహిళల జోలికి వస్తే సీరియస్ యాక్షన్ ఉంటుందని వార్నింగ్

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తేల్చి చెప్పారు. నగర నూతన సీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం హైదరాబాద్ అని, ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య డ్రగ్స్ అని చెప్పారు. దీనిపై ఉక్కుపాదం మోపుతామని, సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. నగరంలో సైబర్ నేరాలు అరికట్టేందుకు అనేక చర్యలు చేపట్టామని, కేటుగాళ్లు ఎక్కువగా వృద్ధులను టార్గెట్ చేసి మోసం చేస్తున్నారని అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన, అప్రమత్తత లేక అనేక మంది నష్టపోతున్నారని, వీటిపై నగర ప్రజలంతా అవగాహన పెంచుకోవాలి.. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో వచ్చే కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



ఆన్‌లైన్ మోసాలపై ప్రత్యేక నిఘా

ఆన్‌లైన్ మోసాలు చేసేవారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని, కల్తీ ఆహారంపై ప్రతేక దృష్టి పెడతాం, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తామని సజ్జనార్ తెలిపారు. మార్కెట్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏర్పాటు చేసి కల్తీ నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారిందని, ఏటా లక్షల్లో కొత్త వాహనాలు వస్తున్నాయన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు కృషి చేస్తామని, ట్రాఫిక్ వల్ల సమయం వృథా మాత్రమే కాదు.. ఆరోగ్యమూ పాడవుతుందన్నారు. ఇక చిన్నారులు, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, మహిళల జోలికి వస్తే సీరియస్‌గా తీసుకుంటామని సజ్జనార్ హెచ్చరించారు.

## కన్నీళ్లు పెట్టుకున్న డీజీపీ జితేందర్

### తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనంగా పదవీ విరమణ

### వీడ్కోలు సభలో అన్ని గుర్తు చేసుకుంటూ జితేందర్ ఎమోషనల్



**హైదరాబాద్, మహా:** రాష్ట్ర వ్యాప్తంగా క్రైమ్ రేట్ తగ్గించడానికి అనేక చర్యలు చేపట్టామని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. జితేందర్ పదవీ విరమణ కార్యక్రమాన్ని మంగళవారం తెలంగాణ పోలీసు అకాడమీలో ఘనంగా నిర్వహించారు. పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సైబర్ క్రైమ్, నార్కోటిక్స్‌పై కఠిన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. కొన్ని సమస్యలను మానవతా కోణంలో పరిష్కరించామని.. బాధితులకు అండగా ఉండేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని వివరించారు. 'డీజీపీగా అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు. గత 15 నెలల్లో శాంతి భద్రతలను అదుపులోకి తీసుకువచ్చాం. జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసుకు మంచి గుర్తింపు వచ్చింది. నార్కోటిక్స్, సైబర్ క్రైమ్‌లతో నిరంతరం యుద్ధం చేస్తున్నాం. బెట్టింగ్ మాఫియాపై లోతుగా దర్యాప్తు చేపట్టాం. దేశవ్యాప్తంగా అనేక చోట్ల సోదాలు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశాం. ఇండియా జస్టిస్ రిపోర్ట్ ప్రకారం తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. నేరాల ఛేదనలో టెక్నాలజీ చాలా కీలకం'' అని జితేందర్ అన్నారు. ఉద్యోగ రీత్యా కుటుంబానికి, బంధువులకు దూరంగా ఉండాల్సి వచ్చిందని జితేందర్ పేర్కొన్నారు. తాను తల్లి, తండ్రి ఇద్దరినీ కోల్పోవడం చాలా బాధ కలిగించిందన్నారు. ఈ సందర్భంగా తన తల్లిని గుర్తు తెచ్చుకుని ఆయన కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ వీడ్కోలు కార్యక్రమానికి కొత్త డీజీపీ శివధర్ రెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఉద్యోగావకాశం

పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న

మహా పత్రికకు

(RNI NO: APTEL/2003/09316)

ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా

స్టాఫ్ రిపోర్టర్లు

కావలెను

WWW.EPAPER.MAHAADAILY.COM

ఆసక్తి గల వారు సంప్రదించండి

MAHAAPATRIKA@GMAIL.COM,

95501 59679, 90001 41919

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM
బుధవారం, హైదరాబాద్
01-10-2025
యంగ్

# టీమిండియాకు.. వీర తిలకం

## మేడ్చల్ కుర్రాడు.. పాక్‌ను చిత్తుచేశాడు

### ఇండియన్ టీమ్ కు మరో కోహ్లి మన తిలక్ వర్మ



**మహా ప్రత్యేకం:** 'ఎప్పుడు వచ్చామన్నది కాదు... బుల్లెట్ దిగిందా లేదా' ఈ డైలాగ్ ఆసియా కప్ 2025 ఫైనల్లో తిలక్ వర్మ ఆటకు సరిగ్గా సరిపోతుంది. 'ఎప్పుడు ఆడామన్నది కాదు... ఆడితే విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాలి' అన్నట్లు సాగింది తిలక్ బ్యాటింగ్. తిలక్ వర్మ.. ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై భారత్ సాధించిన విజయంతో దేశంలోని క్రికెట్ అభిమానులు సంబరాలు చేసుకుంటుండగా, ఈ మ్యాచ్ లో దుమ్మురేపిన తిలక్ వర్మ ట్రెండ్ సెట్టర్ అయ్యారు. హైదరాబాద్ కుర్రాడు తిలక్ వర్మ కీలక సమయంలో మైదానంలో దిగి చివరి వరకు క్రీజులో ఉంటూ అజేయంగా 69 పరుగులు చేసి ఫైనల్ మ్యాచ్ గెలిపించడంతో ఆయన పేరు ఇండియా వ్యాప్తంగా మార్మోగుతోంది. టీమిండియా మాజీ ఆటగాళ్లు ఆయన్ను కోహ్లీతో పోల్చుతూ ప్రశంసలు కురిపిస్తున్నారు. కీలకమైన మ్యాచ్‌లో టాప్ ఆర్డర్ కూలిపోయిన దశలో క్రీజులోకి వచ్చిన ఆయన సంజు శాంసన్, శివమ్ దుబెలతో కలిసి మంచి భాగస్వామ్యాలు నిర్మించడం.. లక్ష్యాన్ని ఛేదించడానికి కావాల్సిన రన్‌రేట్ పెరిగిపోతున్నా మనోనిబ్బరంతో నిలకడగా, ధాటిగా ఆడిన తీరుపై ప్రశంసల జల్లు కురుస్తోంది. మిడిల్ ఆర్డర్‌లో అత్యద్భుతంగా రాణించాడంటూ క్రీడావిశ్లేషకులు కూడా ఆకాశానికెత్తేస్తున్నారు. ఇక మ్యాచ్ తర్వాత తిలక్ వర్మ ఇచ్చిన ఫైనల్ టచ్ తో యూత్ లో ఫ్యాన్ బాయ్ అయిపోయాడు.

### మేడ్చల్ మధ్యతరగతి కుటుంబం

నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ స్వస్థలం మేడ్చల్. సాధారణ మధ్య తరగతి కుటుంబం. అతని చిన్నప్పుడే బీహెచ్‌ఈఎల్ ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారు. తండ్రి నాగరాజు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటారు. తిలక్ తల్లి పేరు గాయత్రి దేవి. తిలక్ వర్మ అన్న తరుణ్ వర్మ బ్యాడ్మింటన్ ప్లేయర్. 11 ఏళ్ల వయసులోనే క్రికెట్ ఆడటం ప్రారంభించిన తిలక్ వర్మ, క్రికెట్ ఆడుతూనే చదువునూ కొనసాగించాడు. తిలక్ వర్మ 2023లో టీమిండియాకు సెలక్ట్ అయ్యారు. "నా ఇద్దరు కొడుకులు తరుణ్ వర్మ, తిలక్ వర్మలను మెడిసన్ చదివించాలనుకున్నా. డాక్టర్లు చేసి సమాజానికి ఎంతో కొంత సేవ చేయించాలని అనుకున్నా. కానీ, తరుణ్ బ్మాడ్మింటన్ వైపు వెళ్లాడు. తిలక్ క్రికెట్‌పై ఇష్టం పెంచుకున్నాడు. తను క్రికెట్ ఆడతానని చెబితే, డాక్టర్ చదివిస్తానని చెప్పా. నేను డాక్టర్‌నయితే చుట్టుపక్కల వాళ్లకే తెలుస్తుంది. అదే క్రికెట్లో రాణించి దేశానికి ఆడితే ప్రపంచానికి తెలుస్తుంది అన్నాడు. ఆ మాటతో ఏమీ అనలేకపోయా" అని నాగరాజు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఎలక్ట్రికల్ వర్క్స్ అదనంగా ఒప్పుకుని డబ్బులు కూడబెట్టుకున్నట్లు నాగరాజు చెప్పారు.

### విజయనగరం నుండే కెరీర్ స్టార్ట్

2019లో విజయనగరంలో జరిగిన హైదరాబాద్ వర్సెస్ ఆంధ్ర మ్యాచ్‌తో ఫస్ట్‌క్లాస్ క్రికెట్ కెరీర్ ప్రారంభించాడు తిలక్ వర్మ. అందులో మొదటి ఇన్నింగ్స్ లో 5 పరుగులు, రెండో ఇన్నింగ్స్ లో 34 పరుగులు చేశాడు. అదే ఏడాదిలో హైదరాబాద్ తరపున సౌరాష్ట్రతో లిస్ట్ ఎ మ్యాచ్, సర్వీసెస్‌తో టీ20 మ్యాచ్ లను తొలిసారిగా ఆడాడు. అనంతరం 2022లో ఐపీఎల్‌లో తొలిసారి ఆడాడు. ఐపీఎల్‌లో ముంబయి జట్టు తరపున ఆడిన తిలక్ మంచి స్ట్రైక్ రేట్‌తో పరుగులు రాబట్టే ఆటగాడిగా పేరు తెచ్చుకున్నాడు. 20 ఏళ్ల తిలక్ వర్మకు క్రికెటర్ సురేశ్ రైనా అంటే ఎంతో ఇష్టం. రైనా తరహాలోనే తిలక్ వర్మ కూడా ఎడమ చేతితో బ్యాటింగ్, కుడి చేతితో బౌలింగ్ చేస్తాడు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా గుర్తింపు పొందాడు. కవర్ డ్రైవ్, స్ట్రయిట్ డ్రైవ్ ఆడటం ఇష్టం. మ్యాచ్ ముగిసిన తర్వాత లోకేషన్నా.. ఈ క్యాప్ నీ కోసమే అంటూ తిలక్ వర్మ పంపిన వీడియో వైరల్ గా మారింది. సోమవారం వర్మ హైదరాబాద్ చేరుకోగా.. ఘనస్వాగతం లభించింది.

### లగ్జరీ కార్లు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు..

తిలక్ వర్మ వద్ద మెర్సిడెజ్ బెంజ్ ఎక్స్‌క్లాస్ మోడల్ ఉంది. దీని ధర సుమారు రూ.1.7 కోట్లుగా ఉంది. దాంతోపాటు బీఎండబ్ల్యూ 7 సిరీస్ కారు కూడా ఉంది. దీని ధర దాదాపు రూ.1.8 కోట్లు. ఇటీవల తన తల్లిదండ్రులకు మహీంద్రా థార్ మోడల్ కారును బహుమతిగా ఇచ్చిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఐపీఎల్ మ్యాచ్ ఫీజులు, బీసీసీఐ కాంట్రాక్ట్‌ల ద్వారా ఈయన నెలవారీ ఆదాయం రూ.20–25 లక్షలుగా ఉందని అంచనా. 2025 ఐపీఎల్ వేలంలో రూ.8 కోట్లు సమకూరాయి. వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వచ్చే ఆదాయం నెలకు రూ.40–50 లక్షలుగా ఉంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈయనకు 3 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు







# అరట్టై.. అదుర్స్

## వాట్సాప్‌కు పోటీగా ఇండియన్ యాప్

### జోహో యాప్.. సింపుల్ సూపర్

**మహా :** ఇన్‌స్టంట్ మెసేజ్ ఫ్లాట్‌ఫాంలో వాట్సాప్‌కు తిరుగులేదు. అత్యధిక జనాభా కలిగిన భారత్‌లో కూడా ఈ యాప్ దే హవా. దీనికి గట్టి పోటీ ఇవ్వడానికి 'అరట్టై' రెడీ అయింది. ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ జోహో కార్పొరేషన్ ఈ కొత్త యాప్‌ను రూపొందించింది. ఇది కేవలం మెసేజింగ్ యాప్‌గా మాత్రమే కాకుండా, అనేక ఆకర్షణీయమైన ఫీచర్లతో యూజర్లను ఆకట్టుకోవడానికి సిద్ధమైంది. భారతదేశంలో టెక్నాలజీ రంగంలో స్వయం సమృద్ధిని సాధించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా 'జోహో' ఈ 'అరట్టై' యాప్‌ను అభివృద్ధి చేసింది. వినియోగదారుల డేటా గోప్యతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ, తమ యూజర్ల డేటా అంతా పూర్తిగా భారతదేశంలోనే సురక్షితంగా ఉంటుందని కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం విదేశీ యాప్‌లతో డేటా డేటా సేఫ్టీ ఆందోళనల 'అరట్టై'కి కలిసిరానుంది.

**యాప్ ఫీచర్లు ప్రత్యేకతలు:**

'అరట్టై' యాప్ వాట్సాప్‌లో ఉన్న సాధారణ ఫీచర్లతో పాటు అదనపు ప్రత్యేకతలను అందిస్తోంది.

**ఇందులో ముఖ్యంగా...**

ఎండ్‌టుఎండ్ ఎన్‌క్రిప్షన్: పర్సనల్, గ్రూప్ చాట్‌లకు పూర్తి భద్రత.

వాయిస్ & వీడియో కాల్స్: స్పష్టమైన కాల్ క్వాలిటీతో పాటు గ్రూప్ కాలింగ్ ఫీచర్ కూడా.

ఛానెల్స్: వార్తలు, సమాచారం కోసం సబ్‌స్క్రైబ్ చేసుకునే అవకాశం.

డాక్యుమెంట్ షేరింగ్: ఆఫీస్ ఫైల్స్ సహా అన్ని రకాల డాక్యుమెంట్లను సులభంగా షేర్ చేసుకోవచ్చు.

లోకల్ ల్యాంగ్వేజ్‌లు: తెలుగు సహా పలు భారతీయ భాషల్లో ఈ యాప్‌ను ఉపయోగించుకునే అవకాశం.

# లోకేష్ స్ఫూర్తిగా.. ప్రజలకు అండగా..

## దూసుకెళ్తున్న ఎర్రమల విజయ్ కిరణ్

### గుంటూరు కారం.. పేదలంటే మమకారం

### యువనేత పనితీరుపై ప్రశంసలు

గుంటూరు, మహా: రాజకీయాల్లోకి అనేకమంది వస్తుంటారు.. పోతుంటారు. చైతన్యం కలిగిన యువత రాజకీయాల్లోకి వస్తే ప్రజలకు న్యాయం జరుగుతుంది. ఆయన అగ్గిబరాటా. పేదలకు ఏదో చేయాలని నిత్యం తపిస్తుంటాడు. యువనేత లోకేష్ స్ఫూర్తిగా, దళిత చైతన్య కీర్తిగా ఎర్రమల విజయ్ కిరణ్ తెలుగుయువత వాయిస్ ను బలంగా చాటాడు. రాజకీయ చదరంగంలో, రణరంగంలో, రాజకీయ రణగొణ ధ్వనులలో, ఆరోపణలు, ప్రత్యారోపణల రాజకీయాల్లో.. యువతరం నిలదొక్కుకోవడం అంత ఆషామాషీ కాదు. చేసే పనిలో నిబద్దత, ప్రజలకు సేవచేయాలన్న తపన.. ఆ యువనేతను ప్రత్యేకంగా నిలబెట్టింది. పల్నాడు పౌరుషం.. గుంటూరు కారం.. పేదల పట్ల మమకారం ఆ యువనేత రాజకీయ శ్రీకారం.. గుంటూరు నగరంలో ప్రజల మనసులు గెలుచుకుంటోంది. గుంటూరు 50వ డివిజన్ గుండెచప్పుడుగా మారిన ఎర్రమల విజయ్ కిరణ్ తెలుగుయువతలో అధికార ప్రతినిధిగా రాణించి ప్రత్యర్థులపై పాశుపతాస్త్రం అయ్యాడు. సీనియర్ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రాజకీయ చాణక్యం. కేంద్రమంత్రి పెమ్మసాని దూకుడు నుండి స్ఫూర్తి పొంది.. దళిత యువ చైతన్యజ్యోతిగా, వాయిస్ ఆఫ్ తెలుగుయువతగా రాజకీయ ప్రత్యర్థిపార్టీలపై విరుచుకుపడుతున్నాడు. యువమంత్రి లోకేష్ ను ఆరాధించే.. విజయ్ కిరణ్ తనకు పార్టీ ఏ బాధ్యత అప్పగించినా.. నెరవేరుస్తూ ప్రశంసలందుకుంటున్నాడు. స్వార్థానికి పునాదులు తవ్వుకుని మోసపు ముసుగులు తొడుక్కుని అసూయాద్వేషాలను ఒంటినిండా పూసుకున్న రాజకీయాల్లో విజయ్ కిరణ్ లాంటి నిస్వార్ధ యువ నాయకులు అత్యంత అరుదు. పేదల కోసం నిత్యం పరితపించే విజయ్ కిరణ్ అంటే యువతలో ప్రత్యేక అభిమానం. యరపతినేని అండాదండ.. స్థానిక ప్రజలకు అండాదండగా ఉంటూ పసుపు చైతన్యబావుటాగా విజయ్ కిరణ్ దుమ్మురేపుతున్నాడు. చంద్రబాబు పథకాలు ప్రజలకు వివరించడంతో పాటు విపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని ఎండగడుతున్నాడు. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. యువనేత లోకేష్ తో పాటు గుంటూరు పసుపు దిగ్గజాల ఆశీస్సులతో విజయ్ కిరణ్ మరిన్ని ఉన్నత అవకాశాలు పొందుతాడన్న ఆకాంక్షను స్థానిక యువకులు, కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నారు.



# స్థానిక ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకారం అందించాలి

**ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ.. పాత్రికేయుల సమావేశంలో వెల్లడి.. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా:** స్థానిక ఎన్నికలను విజయవంతం చేయుటలో రాజకీయ పార్టీలు సహకారం అందించాలని రాజకీయ పార్టీప్రతినిధులకు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఎన్నికల నిర్వహణపై సమీకృత జిల్లా కార్యాలయం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తూచా తప్పక పాటిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ మరియు సర్పంచ్ ఎన్నికలను రెండు విడుతలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ పెట్రోల్ బంక్ తదితర పబ్లిక్ ప్లేస్ లలో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాలలో 72 గంటల వ్యవధిలో పూర్తి స్థాయిలో తొలగించాలన్నారు. అక్టోబర్ 9 న నోటిఫికేషన్ వస్తుందని, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫేజ్ - I ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 9 వ తేదీ నుండి 11 వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని, అక్టోబర్ 23 న మొదటి పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫేజ్ - II ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని, అక్టోబర్ 27 న రెండవ విడత పోలింగ్ జరుగుతుందని తెలిపారు. నవంబర్ 11న ఓట్ల లెక్కింపు నిర్వహించబడుతుందని అన్నారు. సర్పంచ్ ఫేజ్ - I ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 17వ తేదీ నుండి 19వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని, అక్టోబర్ 31న మొదటి పోలింగ్ జరుగుతుందని తెలిపారు. సర్పంచ్ ఫేజ్ ఫేజ్ - II ఎన్నికలకు సంబంధించి, అక్టోబర్ 21వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని, నవంబర్ 4న రెండవ విడత పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఎన్నికలలో తమ సహకారం అందించి ఈ స్థానిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందించి స్థానిక ఎన్నికలు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, కాంగ్రెస్ నుండి ఆవుల యాదయ్య, నవీన్ కుమార్, జంగారెడ్డి, బిఆర్ఎస్ నుండి సత్తు వెంకటరమణ రెడ్డి, మిట్టూ జగదీశ్వర్, బిజెపి నుండి శ్రీరాములు, దేవేందర్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ... స్థానిక ఎన్నికలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. స్థానిక ఎన్నికల షెడ్యూల్ వెలువడిన సందర్భంగా మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయంలో, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ వెలువరించిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వచ్చిందని తెలిపారు. నోటిఫికేషన్ అక్టోబర్ 9 న వస్తుందని, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫేజ్ - I కు సంబంధించి అక్టోబర్ 9 వ తేదీ నుండి 11 వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని, 12వ తేదీన నామినేషన్ల పరిశీలన, అదే రోజు సాయంత్రం 5 గంటల తరువాత చెల్లుబాటు అయిన నామినేటెడ్ అభ్యర్థుల జాబిత విడుదల చేయడం జరుగుతుందన్నారు. అప్పీళ్ళకు అక్టోబర్ 13 చివరి తేదీ, అప్పీళ్ళ పరిష్కారణకు అక్టోబర్ 14 చివరి తేదీ, అభ్యర్థిత్వము ఉపసంహరణ చివరి తేదీ అక్టోబర్ 15, పోటీ చేయు అభ్యర్థుల జాబితా అక్టోబర్ 15 న ప్రచురించడం జరుగుతుందని, అక్టోబర్ 23 న మొదటి పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫేజ్ - II కు సంబంధించి అక్టోబర్ 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని, 16వ తేదీన నామినేషన్ల పరిశీలన, అదే రోజు సాయంత్రం 5 గంటల తరువాత చెల్లుబాటు అయిన నామినేటెడ్ అభ్యర్థుల జాబిత విడుదల చేయడం జరుగుతుందన్నారు. అప్పీళ్ళకు అక్టోబర్ 17 చివరి తేదీ, అప్పీళ్ళ పరిష్కారణకు అక్టోబర్ 18 చివరి తేదీ, అక్టోబర్ 23 న మొదటి పోలింగ్ జరుగుతుందని, అభ్యర్థిత్వము ఉపసంహరణ చివరి తేదీ అక్టోబర్ 19, పోటీ చేయు అభ్యర్థుల జాబితా అక్టోబర్ 19న ప్రచురించడం జరుగుతుందని, అక్టోబర్ 27 న రెండవ విడత పోలింగ్ జరుగుతుందని తెలిపారు. సర్పంచ్ ఫేజ్ - I ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 17వ తేదీ నుండి 19వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని, 20 న నామినేషన్ల పరిశీలన, అదే రోజు సాయంత్రం 5 గంటల తరువాత చెల్లుబాటు అయిన నామినేటెడ్ అభ్యర్థుల జాబిత విడుదల చేయడం జరుగుతుందన్నారు. అప్పీళ్ళకు అక్టోబర్ 21 చివరి తేదీ, అప్పీళ్ళ పరిష్కారణకు అక్టోబర్ 22 చివరి తేదీ, అభ్యర్థిత్వము ఉపసంహరణ చివరి తేదీ అక్టోబర్ 23 పోటీ చేయు అభ్యర్థుల జాబితా అక్టోబర్ 23న ప్రచురించడం జరుగుతుందని, అక్టోబర్ 31న మొదటి పోలింగ్ జరుగుతుందని తెలిపారు.



## సిపిఐ జాతీయ సభ్యునిగా పాలమాకుల జంగయ్య

**రాజేంద్రనగర్ మహా ;** రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యదర్శి పాలమాకుల జంగయ్యని సిపిఐ జాతీయ సమితి సభ్యునిగా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నిక చేయడంతో శంషాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో పాలమాకుల జంగయ్యని మంగళవారం అయిన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు యాదగిరి, సిపిఐ మండల కార్యదర్శి నర్రగిరి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అన్నపు ప్రభు, ఏఐటియుసి నాయకుడు గిలకరాజు తదితరులుపాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి రైతు సహకార సంఘాల కృషి అమోఘం

**టీజీ క్యాబ్ వైస్ చైర్మన్, జిల్లా డిసిసిబి చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య**



**రంగారెడ్డి జిల్లా మహా:** రైతుల సంక్షేమానికి రైతు సేవ సహకార సంఘాలు ఎంతగానో కృషి చేస్తాయని, టీజీ క్యాబ్ వైస్ చైర్మన్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. సోమవారం తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘం లిమిటెడ్ 53వ సర్వసభ సమావేశం జిల్లా డిసిసిబి చైర్మన్ కొత్త కురుమ సత్తయ్య అధ్యక్షతన, మన్నెగూడలోని జేఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తకుర్మ సత్తయ్య మాట్లాడుతూ... రైతు సంక్షేమానికి రైతు సేవ సహకార సంఘాలు ఎంతగానో కృషి చేస్తాయని అన్నారు. తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘం 50 సంవత్సరాలు పూర్తి చేసుకుని 51 సంవత్సరంలోకి అడుగు పెట్టింది అన్నారు. సంఘంలో తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొత్త రామిరెడ్డి, పాలకవర్గం సభ్యులు మాజీ చైర్మన్లు సమ్ రెడ్డి బాల్ రెడ్డి, కొంత మల్లారెడ్డి, ఒంగేటి లక్ష్మారెడ్డి, చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, కుతాడి నర్సింగరావు, కొంద్రు స్వప్న, శ్రీనివాస్, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, జక్క రామిరెడ్డి, భార్గవి, సంఘం సెక్రెటరీ వై రాందాస్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే చివరగా కొత్త కురుమ సత్తయ్య గారు రైతులకు పత్రిక మిత్రులకు అందరికీ ముందుగా దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు




## తొండుపల్లి ఫ్లై ఓవర్ పై వాహనాలు

**రెండు రోజులపాటు నిషేధం**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండపల్లి ఫ్లైఓవర్ పై నేషనల్ హైవే అధికారులు లోడ్ టెస్ట్ జరుపనుండడంతో పాలమాకులు వైపు వెళ్లే వాహనాలను తొండుపల్లి ఫ్లైఓవర్ పైకి నిషేధించారు. పాలమాకులు పైపు వెళ్లే వాహనాలు సర్వీస్ రోడ్డు వైపులా వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.

## కలెక్టరేట్ లో ఎలక్షన్ హెల్ప్ డెస్క్ ప్రారంభం...

**యాదాద్రి భువనగిరి, మహా**



ఎంపిటీసి, జెడ్ పి టీసి, గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని మంగళ వారం నాడు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ను అదనపు కలెక్టర్ వీరా రెడ్డి ప్రారంభించారు... హెల్ప డెస్క్ ఇన్ చార్జ్ గా డివిజనల్ పంచాయతీ అధికారి ప్రతాప్ నాయక్ ను నియమించారు సహాయక కేంద్రం మోబైల్ నెంబర్ 8978928637 ఈ నెంబర్ కు ఫోన్ చేసి ఎన్నికల వివరాలు తెలుసుకొవచ్చాన్నారు అదనపు కలెక్టర్... ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, అడ్మినిస్ట్రేట్ అధికారి జగన్ లు వున్నారు.

## కుటుంబంకై సమయాన్ని కేటాయించండి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**హన్మకొండ మహా;** ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిరంతరం పోలీసులు విధులు నిర్వహించి నేడు పదవీవిరమణ చేసిన పోలీస్ అధికారులు ఇకనైనా తమ కుటుంబ సభ్యులతో గడపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుధీర్ఘ కాలం పని చేసి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారులను సీపీ వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేసారు. పదవీ విరమణ పొందిన వారిలో , ఎస్ ఐలు జే మనోహర్ రాజు, వి చంద్రమౌళి, ఆర్ ఎస్ఐ యండి నయీమ్, ఏ.ఆర్.ఎస్.ఐలు స్. కుమారస్వామి, ఎస్. డి సుజావుద్దీన్, జే. ప్రభాకర్ రెడ్డి, వి. సారయ్య వున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మీ సేవలు నేటి తరం పోలీసులకు అదర్శంగా నిలుస్తుందని, నేటి ఈ ప్రశాంత వాతావరణానికి మీ సేవలే కారణమని, మీ అందించిన సేవలు మరువమని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమములో అదనపు డిసిపిలు రవి, సురేష్ కుమార్,ఏసీపీ నాగయ్య,ఆర్. ఐలు సతీష్,స్పర్జన్ రాజ్, ఆర్.ఎస్. ఐ శ్రవణ్ తో పాటు పదవీ విరమణ పొందిన సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గోన్నారు.




## చోల్లేరు ఆరోగ్య కేంద్ర సిబ్బందికి షోకాజ్ నోటీసులు

**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం చొల్లేరు గ్రామంలో పల్లె దవాఖానను జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం నాడు ఆకస్మిక తనిఖీలో భాగంగా పల్లె దవాఖానకు కలెక్టర్ చేశారు. ఆ సమయంలో సిబ్బంది ఎవరు లేకపోవడం తో ఎంఎల్ ఎచ్ పి కి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్యాధికారికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు



**అమనగల్లు, మహా :** తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం మన వారసత్వాన్ని కాపాడే ప్రకృతిని పూజించే గొప్ప పండుగ బతుకమ్మ అని కమిషనర్ శంకర్ నాయక్ అన్నారు.మంగళవారం ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు, కార్మికులు రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడి సంబరాలు చేసుకున్నారు. పూలను పూజించే సంస్కృతి మన రాష్ట్రంలో మాత్రమే ఉందని కమిషనర్ తెలిపారు.బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి గర్వమని కొనియాడారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, సంప్రదాయ ఆటపాటలతో పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ మేనేజర్ ఆంజనేయులు, శానిటరీ ఇన్స్పెక్టర్ రమేశ్, జూనియర్ అసిస్టెంట్ లు ఉపేందర్, రాధిక, బిల్ కలెక్టర్ లు కార్యాలయ సిబ్బంది రామకృష్ణ, శ్రావణ్,మనిషా, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు: సీఐ

**ఆమనగల్లు,మహా:** స్థానిక ఎన్నికలలో ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్య చర్యలు తప్పవని సీఐ గంగాధర్ చెప్పారు. ఎన్నికల దృష్ట్యా మంగళవారం కడ్తాల్ మండలంలో ఆయన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలుజరగకుండా పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.



## కోట్లు విలువ చేసే సర్కార్ భూమిలో ఫ్రీ కాస్ట్ వేస్తున్న రియాల్టర్

**స్థానికుల ఫిర్యాదుతో ప్రభుత్వం బోర్డులు ఏర్పాటు**

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం చౌదర్ గూడా రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 160 లో 10 కోట్లు విలువచేసే, సుమారు మూడు ఎకరాల అసైన్డ్ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఫ్రీ కాస్ట్ వేసి కబ్జాకు ప్రయత్నించగా మంగళవారం స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఎమ్మార్వో రవీందర్ దత్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు చౌదర్ గూడా రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 160 లో ప్రభుత్వ బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే ప్రయత్నం ఎవరు చేసిన ల్యాండ్ గ్రాఫింగ్ కేసులు నమోదు చేస్తామని ఎమ్మార్వో రవీందర్ దత్ హెచ్చరించారు. సర్కార్ భూములలో ప్రభుత్వ బోర్డులు ఏర్పాటుచేశారు.



## మహా చండీ రూపంలో అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ తోకల

**రాజేంద్రనగర్ మహా ;** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలో భాగంగా మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ, సాయిబాబానగర్ కాలనీలలో మంగళవారం దుర్గామాత అమ్మవారి దేవాలయంలో 9వ రోజు శ్రీ దుర్గా దేవి మహా చండి అలంకరణ రూపంలో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరికీ దేవి శరన్నవరాత్రి, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, రావుల భాస్కర్, అడికే జనార్ధన్, మన్మోహన్ రెడ్డి, సంతోష్ గౌడ్ , రావుల రాజు, తలారి చిన్న, మధుసూదన్ రెడ్డి, కిషన్, బాలకృష్ణ, రమేష్, దత్తు, కుమార్ ముదిరాజ్, సతీష్, శంకర్ రెడ్డి, మండపం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి మంగళవారం ఓ ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి రూ. లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గ్రామస్థుల వినతి మేరకు తన వంతు సహాయం అందించినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అమర్ సింగ్,మల్లేష్, పూజారి వినోద్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు రామ్ జా, మల్లేష్, తాహు, మల్య, మణిపాల్,కేషన్, శ్రీను పాల్గొన్నారు.

## భూకబ్జా, అట్రాసిటీ కేసులో బీజేపీ నేత రఘుపతి అరెస్ట్

- రౌడీయిజం చేస్తే ఎవర్నీ వదిలేది లేదన్న పోలీసులు
- నిందితుడిపై ఇప్పటికే రౌడీషీట్ తో పాటు పలు కేసులు



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ జిల్లా మావల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న దళితుల భూస్వాధీన ప్రయత్నం , ప్రాణహాని, బెదిరింపులు కేసులో నిందితుడు ఉష్కం రఘుపతి ని అరెస్టు చేసినట్టు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు.మంగళవారం తన కార్యాలయంలో మీడియా కు వివరాలు వెల్లడించారు.ఆరు సంవత్సరాల క్రితం బాధితులు గంగన్న, ఎరే లక్ష్మి తమ అసైన్డ్ పట్టా భూములను రఘుపతి వద్ద తాకట్టు పెట్టి అప్పుతీసుకున్నారు. 2025 జూన్ 5న తమ భూములను తిరిగి సాగు చేసుకోవడానికి, అప్పు తీర్చడానికి వచ్చారు.అయితే నిందితుడు కొంత మందితో కలిసి అక్కడికి చేరుకొని వారిని ప్రాణహానికి గురి చేస్తూ, ట్రాక్టర్ తో తొక్కిస్తానని బెదిరించి, భూములను అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేసాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఆదేశాల మేరకు జ్యూడిషియల్ రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. నిందితుడు రఘుపతిపై ఇప్పటికే మావల పీఎస్ లో రౌడీషీటు తో పాటు పలు కేసులలో నిందితుడుగా ఉన్నట్లు తెలిపారు.ఆదిలాబాద్ లో ఎలాంటి ఫోర్జరీలకు, భూ అక్రమాలకు, దౌర్జన్యాలకు పాల్పడిన , ప్రైవేటు భూములను ఆక్రమించే ప్రయత్నం చేసినా వారి పట్ల చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధితులకు న్యాయం చేయడం, చట్టంశాంతి భద్రతను కాపాడడం కోసం పోలీసులు కట్టుబడి ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మావల సీఐ కర్ర స్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్



**బెల్లంపల్లి, మహా:** దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా సోమగూడెంలో ప్రత్యేక పూజలను ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మంగళవారం నాడు నిర్వహించారు.బెల్లంపల్లిమండలంలోని సోమగూడెంలో దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలుపుతూ, దేవి ఆశీస్సులతో ప్రాంతం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**కాటారం, మహా :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం ఐడిఓసీ కార్యాలయపు కాన్ఫరెన్స్ హాలులో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా రాజకీయ పార్టీలు ఎన్నికలలో పాటించాల్సిన నియమ, నిబంధనల గురించి జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సోమవారం నుంచి ఎన్నికల కోడ్ అమలులో వచ్చినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎలాంటి రాజకీయ పార్టీల సమావేశాలు, సభలు నిర్వహించరాదని సూచించారు. జిల్లాలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్ లను తొలగించాలని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించే వారిపై ఎన్నికల సంగం నిబంధనలు మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే నేరుగా కానీ సివిజిల్ యాప్ ద్వారా లైవ్ వీడియోలతో ఫిర్యాదు చేయవచ్చని, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కూడా 24 గంటలలో పిర్యాదు చేయవచ్చనితెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కోడ్ అమలులో ఉన్నందున రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి అనుమతి లేదని వివరించారు. రాజకీయ పార్టీలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో సమావేశాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించొద్దని సూచించారు. భూపాలపల్లి మున్సిపాల్టీలో ఎన్నికల కోడ్ వర్తించదని కానీ ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఫ్లెక్సీలు, పోస్టర్లు, టీవీ యాడ్స్ చేయరాదని తెలిపారు .ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్,విజయలక్ష్మి, డీపీఓ శ్రీలత వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

**జిల్లా అనుషానల్ ఎస్పీ నరేష్ కుమార్**



**భూపాలపల్లి, మహా :** ప్రభుత్వ శాఖల లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎన్ని రోజులు ఉద్యోగం చేసిన పదవీ విరమణ తప్పనిసరి ఉంటుందని భూపాలపల్లి జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ అన్నారు మంగళ వారం పదవీ విరమణ పొందుతున్న ఏ ఎస్ ఐ లు బి రవీందర్ రెడ్డి,జి రాజేశం లను పోలీసు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎస్పీ నరేష్ కుమార్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి సన్మానం ప్రేరణగా ఉంటుందన్నారు. పోలీసు సేవలు అత్యంత కఠినమైనవి. కుటుంబ సౌకర్యాల కంటే సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తారని,ఎన్నో ఒత్తిడులు, సవాళ్ల మధ్య విధులను విజయవంతంగా నిర్వర్తించారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఇకపై కుటుంబ సభ్యుల అభివృద్ధి కోసం సమయాన్ని కేటాయించడం ద్వారా మరింత సంతృప్తి పొందవచ్చనని సూచించారు. జిల్లాలోని ఏ ఎస్ ఐ బి రవీందర్ రెడ్డి, జి రాజేశం లు మంగళవారంతో పదవీ విరమణ చేశారు. జిల్లా అధికారుల సంఘం పదవీ విరమణ ఉద్యోగులకు కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేస్తూ వారి సేవలను గుర్తించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ రత్నం, పోలీస్ సంఘం ప్రతినిధి మర్కాలయాది రెడ్డి, రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి సన్మానం చేయడం ఉద్యోగుల కు ప్రేరణనిచ్చేలా మారిందని అధికారులు అభిప్రాయపడ్డారు.

## రావణవధకు ఏర్పాట్లు పూర్తి

**దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు గుండు పూర్ణచందర్**



**వరంగల్ మహా;** విజయదశమి పండుగ సందర్భంగా అక్టోబర్ 2వ తేదీ గురువారం సాయంత్రం రంగశాయిపేట లోని మహంకాళి గుడి ఆవరణలో రావణవద కార్యక్రమ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రంగశాయిపేట దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు గుండు పూర్ణచందర్ తెలిపారు. మంగళవారం మహంకాళి గుడి ఆవరణలో రంగశాయిపేట దసరా ఉత్సవ సమితి అధ్యక్షులు గుండు పూర్ణచందర్ ప్రధానకార్యదర్శి దామెరకొండ కరుణాకర్ లు ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షులు గుండు పూర్ణచందర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 36 ఫీట్ల ఎత్తైన రావణ ప్రతిమను ఏర్పాటు చేయడంతో పాటు వివిధ రకాల బాణసంచాలను కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ రావనవధ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి కొండా సురేఖ మాజీ ఎమ్మెల్సీ మురళీధర్ రావు, విశిష్ట అతిథులుగా అలాగే గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ప్రభాకర్, గౌరవ అతిథులుగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, ప్రత్యేక అతిథులుగా 10వ అడిషనల్ సికింద్రాబాద్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ డాక్టర్ కంచ ప్రసాద్, సీనియర్ నాయకులు గోపాల నవీన్ రాజ్, 42 వడివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, 41 వడివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ స్వామి, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ జనార్ధన్, సీనియర్ పాత్రికేయులు శంకేసి శంకర్రావు లు విచ్చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులు ముత్తినేని రామమూర్తి, కొక్కొండ భాస్కర్, పరికిపండ్ల రాజేశ్వర్ రావు, మండల లక్ష్మయ్య, మడుపోజు రామ్మూర్తి, బివి రామకృష్ణ ప్రసాద్, వలుపదాసు రాజశేఖర్, శంకేశి వెంకటేశ్వర్లు, కంచ రమేష్, పాకాల మనోహర్, బజ్జూరి వీరేశం, బక్కి వంశీ, పస్తం బిక్షపతి, చిమ్మని చంద్రమౌళి, పాకాల రాజేందర్, పూసల కిరణ్, కన్నెబోయిన కుమార్, ఏలుగు అశోక్, అవునూరి కుమార్, అల్లం వీరస్వామి, ఇట్టబోయిన ప్రదీప్, విజయగిరి మాల్యాద్రి, కర్నే రవీందర్, అంబటి రమేష్, మహంకాళి దేవాలయ ప్రతినిధులు పాకాల చక్రపాణి, లింగమూర్తి పాల్గొన్నారు.

# సంస్కార భారతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

### తెలంగాణ ఉద్యమానికి ఊపిరినిచ్చిన బతుకమ్మ

### జిల్లా అధ్యక్షులు డాక్టర్ బందెల మోహన్



**వరంగల్ మహా;** సంస్కార భారతి వరంగల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బందెల మోహన్ రావు ఆధ్వర్యంలో ప్రతి ఏటా సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా జెమిని అడ్స్ ఎదురుగా పోతన నగర్ రోడ్డు లో బ్రతుకమ్మ ఆహ్వాన వేదిక ద్వారా ఉత్తమ బతుకమ్మ అలంకరణ, బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన మహిళలకు పట్టు చీరలు, వెండి కుంకుమ భరిణలు, కాసం పుల్లయ్య, కొత్తకొండ సిల్వర్ పాలస్ వారి సౌజన్యం తో బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మోహన్ రావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ విశిష్టతను తెలియజేస్తూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ అని తెలంగాణ ఆడపడుచులంతా జరుపుకునే గొప్ప వేడుక, బంధాలను అనుబంధాలను గుర్తు చేస్తూ ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పే గొప్ప పండుగ ఈ బతుకమ్మ అని అన్నారు. బాద్రపద అమావాస్య నుండి ఎంగిలి పూల బతుకమ్మ తో మొదలయ్యి దుర్గాష్టమి నాడు సద్దుల బతుకమ్మ తో పూర్తవుతుందని మహిళలందరూ సకల సంపదలని ఇచ్చే శ్రీ చక్రాన్ని పోలిన ఆకారం లో బతుకమ్మని పూలతో పేర్చిన ఇదో పూల పండుగ, పూలనే దేవతగా కొలిచే పండుగ, తొమ్మిది రోజులపాటు అంగరంగ వైభవంగా ఆడి పాడి గౌరీదేవిని, అత్యంత భక్తి శ్రద్ధలతో ఆరాధించి, పూజించి, గౌరమ్మను, గంగమ్మ సరసన చేర్చే అపురూపమైన రోజు ఈ సద్దుల బతుకమ్మ పండుగని వివరించారు. ముఖ్యంగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం లో తెలంగాణ సాధన లో భాగంగా రోడ్ల మీద బతుకమ్మ ఆట పాటలతో ఉద్యమ కారులకు ప్రేరణ కలిగించారని గుర్తు చేశారు. ప్రపంచ దేశాలలో చాలా చోట్ల తెలుగు ఆడపడుచులు బతుకమ్మ పండుగ ను వైభవంగా జరుపుకుంటున్నారు. కాగా నేటి యువత పాశ్చాత్య నాగరిత వైపు ఆకర్షింప బడుతున్న ఈ క్రమంలో మన నాగరికత ఇది, మన సంస్కృతి, సాంప్రదాయం ఇదని చాటి చెప్పే మన తెలంగాణ ఆడపడుచులకు శుభాకాంక్షలు తెలుపుతూ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

### మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాలో జెడ్ పి టి సి, ఎం పి టి సి ఎన్నికలు 2 విడతలలో, సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికలు 3 విడతలలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, 24 గంటలలో ప్రభుత్వ కార్యాలయాలలో, 48 గంటలలో పబ్లిక్ ప్లేసెస్ లలో, 72 గంటలలో పూర్తిగా రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, ఇతర ప్రచార సంబంధిత అంశాలను తొలగించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు సంబంధిత అధికారుల నుండి అనుమతులు తప్పని సరిగా పొందాలని, సరైన అనుమతి లేకుండా నిర్వహించకూడదని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ సర్వేయలెన్సు టీం, స్టాటిస్టిక్స్ సర్వేయాలెన్స్ టీం లను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని, నోడల్ అధికారులు, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్, బ్యాలెట్ బాక్స్, బ్యాలెట్ పేపర్ ఇతర ఎన్నికల సంబంధిత ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, పెయిడ్ న్యూస్ సంబంధించి ప్రత్యేకంగా పర్యవేక్షించి సంబంధిత రాజకీయ పార్టీ/ అభ్యర్థి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పోలీస్, సంబంధిత శాఖల సమన్వయంతో సాధారణ పంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా, స్వేచ్ఛ వాతావరణంలో శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**ప్రిసైడింగ్ అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలి**

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల ప్రకటన వెలువడినందున ఎన్నికల కార్యచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని వివరించారు. నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజున తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని తెలిపారు. పోలింగ్ రోజున ఓటర్ల గుర్తింపు పరిశీలన, బ్యాలెట్ పేపర్ జారీ, వేలుపై సిరాచుక్క, ప్రిసైడింగ్ అధికారి డైరీ, బ్యాలెట్ అకౌంట్ నిర్వహణ, చాలెంజ్, టెండర్ ఓట్ల జారీ విధులను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు.



## 2300 సిమెంట్ బ్యాగులతో 9000 ఎస్.ఎఫ్.టి.తో పిటి స్లాబ్

### మంచిర్యాల సాగర్ సిమెంట్ డిస్ట్రిబ్యూటర్స్ రాజ్ కుమార్ రెన్వ

**మంచిర్యాల, మహా :** 2300 సాగర్ సిమెంట్ బ్యాగులతో 9000 ఎస్.ఎఫ్.టి.తో పిటి స్లాబ్ వేసి మంచిర్యాల జిల్లా కేంద్రంలో చరిత్ర సృష్టించినట్లు సాగర్ సిమెంట్ డిస్ట్రిబ్యూటర్స్ రాజ్ కుమార్ రెన్వ వెల్లడించారు. మంగళవారం వేంపల్లిలో పెద్ద స్లాబ్ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సాగర్ సిమెంట్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ రాజ్ కుమార్ రెన్వ, కంపెనీ ఇంజనీర్ అభిలాష్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సేల్స్ ఇన్చార్జి నరేష్ రెడ్డి యోగేష్ రెన్వ లు మాట్లాడుతూ ఈ స్లాబ్ నిర్మాణంతో సాగర్ సూపర్ చరిత్ర సృష్టించిందని వెల్లడించారు. పెద్ద భవనాల నిర్మాణాలను అతి త్వరలో పూర్తి చేయాలంటే సాగర్ సూపర్ క్యూరింగ్ అగ్రగామని తెలిపారు. సమయం తక్కువ లోనే సిమెంట్ ఐరన్ తో కలిసిపోయి గట్టిగా మారిపోతుందని అన్నారు. ప్రతి కట్టడ నిర్మాణాల్లో గ్రౌండ్ స్థాయి నుండి సాగర్ సూపర్ సిమెంట్ వాడటంతో బలిష్టమైన గట్టితనం నిర్మాణాలకు వస్తుందని వివరించారు. నిర్మాణం ప్రాథమిక దశ నుండే ఈ సిమెంట్ వాడకం అత్యవసరమని తెలిపారు.

# యాస్పిరేషన్ పారా మీటర్లు పకడ్బందీగా నమోదు చేయాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి, మహా :** యాస్పిరేషన్ పారా మీటర్లు పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో పలిమెల, మహాముత్తారం మండలాల యాస్పిరేషన్ పారా మీటర్లు నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాస్పిరేషన్ ఇండికేటర్స్ నమోదు ఖచ్చితంగా, పారదర్శకంగా ఉండాలని, ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను నిర్దిష్టమైన సమయానికి పూర్తిచేయాలని సూచించారు. విద్య, వైద్య ఆరోగ్యం, ఉద్యాన, వ్యవసాయం, మహిళా శిశు సంక్షేమం వంటి విభాగాల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసి, గ్రామ స్థాయిలో డేటా నమోదు లో ఎలాంటి లోపాలు, వ్యత్యాసం రాకుండా ఖచ్చితత్వం వుండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జనాభా, వసతులు, అభివృద్ధి సూచికలు, శిశు, మాతృ ఆరోగ్యం, విద్యా ప్రమాణాలు, పంటల ఉత్పాదకత వంటి అంశాలను సమగ్రంగా నమోదు చేసి, సమయానికి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

**స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి**

ఎన్నికలు సజావుగా నిర్వహించుటలో అధికారుల విధులు చాలా కీలకమని, చిన్న పొరపాటుకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎన్నికలు నిర్వహణలో నోడల్ అధికారులు సమగ్రమైన అవగాహన కలిగివుండాలని సూచించారు. ఎన్నికల విధులు చాలా కీలకమని, చిన్న పొరపాటుకు తవులేకుండా పకడ్బందీగా నిర్వహించుటకై అధికారులు కార్యోన్ముఖులు కావాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో స్థానిక సంస్థలు ఎన్నికలు ప్రక్రియ పర్యవేక్షణ నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధులు నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల సంగం నిబంధనలు మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, బహుమతులు పంపిణీపై పటిష్టమైన నిఘా ఉండాలని తెలిపారు. చెక్ పోస్టులలో వాహనాలను నిశిత పరిశీలన చేయాలని ఆదేశించారు. నోడల్ అధికారులు వారికి కేటాయించిన అంశాలపై ప్రతి రోజు సమగ్ర నివేదికలు అందచేయాలని సూచించారు. నోటిఫికేషన్ విడుదలైన తరువాత నామినేషన్ స్వీకరణ నుంచి ఫలితాలు వెలువడే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల విధులు నిర్వహణపై హ్యాండ్ బుక్ లోని ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఏదేని సమస్య వస్తే తక్షణమే తన దృష్టికి తీసుకొచ్చి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మాన్ పవర్, బ్యాలెట్ బాక్సులు, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్మెంట్, శిక్షణా కార్యక్రమాల నిర్వహణ, మెటీరియల్ మేనేజ్మెంట్, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్, మీడియా కమ్యూనికేషన్, హెల్ప్‌లైన్ అండ్ కంప్లైంట్స్ రెడ్రెస్సల్, వెబ్‌కాస్టింగ్ తదితర విభాగాలపై నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేయాలని సూచించారు.



## స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

### నోడల్ అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, మహా :** చిన్న పొరపాటుకు తావు లేకుండా స్థానిక సంస్థల ఎన్న కలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో స్థానిక సంస్థలు ఎన్నికలు ప్రక్రియ పర్యవేక్షణ నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించుటలో అధికారుల విధులు చాలా కీలకమని, చిన్న పొరపాటుకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎన్నికలు నిర్వహణలో నోడల్ అధికారులు సమగ్రమైన అవగాహన కలిగివుండాలని సూచించారు. ఎన్నికల విధులు చాలా కీలకమని, చిన్న పొరపాటుకు తవులేకుండా పకడ్బందీగా నిర్వహించుటకై అధికారులు కార్యోన్ముఖులు కావాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో స్థానిక సంస్థలు ఎన్నికలు ప్రక్రియ పర్యవేక్షణ నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధులు నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల సంగం నిబంధనలు మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, బహుమతులు పంపిణీపై పటిష్టమైన నిఘా ఉండాలని తెలిపారు. చెక్ పోస్టులలో వాహనాలను నిశిత పరిశీలన చేయాలని ఆదేశించారు. నోడల్ అధికారులు వారికి కేటాయించిన అంశాలపై ప్రతి రోజు సమగ్ర నివేదికలు అందచేయాలని సూచించారు. నోటిఫికేషన్ విడుదలైన తరువాత నామినేషన్ స్వీకరణ నుంచి ఫలితాలు వెలువడే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల విధులు నిర్వహణపై హ్యాండ్ బుక్ లోని ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఏదేని సమస్య వస్తే తక్షణమే తన దృష్టికి తీసుకొచ్చి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మాన్ పవర్, బ్యాలెట్ బాక్సులు, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్మెంట్, శిక్షణా కార్యక్రమాల నిర్వహణ, మెటీరియల్ మేనేజ్మెంట్, ఎక్స్‌పెండిచర్ మానిటరింగ్, మీడియా కమ్యూనికేషన్, హెల్ప్‌లైన్ అండ్ కంప్లైంట్స్ రెడ్రెస్సల్, వెబ్‌కాస్టింగ్ తదితర విభాగాలపై నోడల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ శ్రీలత, అన్ని విభాగాల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరాశ జనకంగా సెప్టెంబర్ మాసం ఉత్పత్తి లక్ష్యం

### ప్రశాంత వాతావరణంలో దసరా సంబరాలు నిర్వహించుకోవాలి

### మందమర్రి ఏరియా జిఎం రాధాకృష్ణ



**మందమర్రి, మహా :** నిరాశ జనకంగా సెప్టెంబర్ మాసం బొగ్గు ఉత్పత్తి లక్ష్యం ఉందని మందమర్రి ఏరియా జిఎం రాధాకృష్ణ విచారం వ్యక్తం చేశారు. మంగళవారం జిఎం సమావేశ మందిరంలో సెప్టెంబర్ మాసం బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాసంలో ఎక్కువ వర్షాలు కురవడంతో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించలేకపోయామని అన్నారు. ఏరియా ఉత్పత్తి లక్ష్యం 204500 టన్నులు కాగా 115137 టన్నులు సాధించి 89363 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడంలో వెనుక పడ్డామని వెల్లడించారు. కేవలం ఏరియాలో కే.కే5 గని మాత్రమే 101 శాతం బొగ్గు ఉత్పత్తి చేసి ముందు వరసలో నిలిచిందని చెప్పారు. కే.కే.ఓ.సి, ఓ.బి. 5.80 తీయవలసి ఉండగా కేవలం 0.48 మాత్రమే తీయడం వల్ల, అలాగే అకాల వర్షాల వల్ల పనులు చేయలేకపోయారని ఆయన తెలిపారు. ఏరియాలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పిల్లలకు విద్య, వైద్యం, ఆరోగ్యం విషయాలలో సింగరేణి సంస్థ కోట్లాది రూపాలు ఖర్చు చేస్తుందని వివరించారు. ప్రస్తుతం మందమర్రి ఏరియా నష్టాల బాటలో ఉందని చెప్పారు. ఈ నష్టాలను అధిగమించాలంటే ఏరియాలో కార్మికులు గైర్హాజరు కాకుండా రోజు వారీగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సంవత్సరం కంపెనీ సాధించిన లాభాలలో 34 శాతం వాటా 819 కోట్ల రూపాయలను కార్మికుల బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరిగిందని అన్నారు. అంతేకాకుండా దీపావళి లాభాల బోనస్ ప్రతి కార్మికునికి సగటున లక్ష 3 వేల రూపాయలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా దసరా పండగ అడ్వాన్స్ కింద 25 వేల రూపాయలు కూడా అందజేసినట్లు తెలిపారు. ఈనెల సగటున ప్రతీ కార్మికునికి మూడు లక్షల రూపాయల వరకు పండుగ సందర్భంగా అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో కార్మిక కుటుంబాలు దసరా పండగ సంబరాలు జరుపుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ బొగ్గు మార్కెట్లో తీవ్రమైన పోటీని ఎదుర్కొంటుందని అన్నారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి ఖర్చు టన్నుకు 3500 రూపాయలు ఖర్చవుతుండగా అమ్మకం ద్వారా కేవలం 3900 వస్తుందని అన్నారు. కోల్ ఇండియా తో పాటు ఇతర ప్రైవేట్ కంపెనీలు 2 వేల రూపాయలకే టన్ను అమ్ముతున్నారని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని కార్మికులు ఎనిమిది గంటలలో ఎక్కువ బొగ్గు ఉత్పత్తి చేసేలా చొరవ చూపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో తోటి స్నేహితుడి దారుణ హత్య

**మహా /గండిపేట:** మద్యం మత్తులో స్నేహితుల మధ్య గొడవ కాస్త ఘర్షణగా మారటంతో ఇద్దరు స్నేహితులు కలిసి కత్తులతో తోటి స్నేహితుడిని విచక్షణారహితంగా పొడిచి చంపిన ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోకాపేటలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. నార్సింగి సిఐ హరికృష్ణ రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోకాపేటలోని డబుల్ బెడ్ రూమ్ అపార్ట్మెంట్ వద్ద అర్ధరాత్రి సమయంలో స్నేహితులు అయిన యాదగిరి, ఆఫ్రోజ్, నవాజ్ కలిసి మద్యం తాగారు.అనంతరం వీరి ముగ్గురు మధ్య చిన్న విషయంలో గొడవ తలెత్తగా ఆది కాస్త ఘర్షణగా మారటంతో విచక్షణ కోల్పోయిన తోటి స్నేహితులు అఫ్రోజ్ నవాజ్ కలిసి యాదగిరిని కత్తులతో విచక్షణారహితంగా పొడిచారు. దీంతో యాదగిరి తీవ్రంగా గాయపడి కేకలు వెయ్యటంతో, స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు ఘటన స్థలానికి చేరుకోగా అప్పటికే యాదగిరి మృతి చెందాడు. అనంతరం వివరాలు సేకరించిన పోలీసులు అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

# జర్నలిస్ట్ కుటుంబానికి లక్ష రూపాయల చెక్కు అందజేత

### జర్నలిస్ట్ కుటుంబానికి అండగా టియుడబ్ల్యూజే ఐజేయు యూనియన్

### జర్నలిస్ట్ భార్యకు చెక్కును అందజేసిన ముఫీషియల్ రాష్ట్ర కమిటీ కన్వీనర్ గుడుపల్లి శ్రీనివాస్



**షాద్ నగర్, మహా:** జర్నలిస్టు కుటుంబాలకు మేమున్నామంటూ భరోసా కల్పించడంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ ముందుంటుందని రాష్ట్ర మఫీషియల్ కన్వీనర్ జి. శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో పేపర్ శ్రీనివాస్ నివాసంలో గత కొన్ని రోజుల క్రితం మృతి చెందిన నందిగామ మండలానికి చెందిన జర్నలిస్టు రమేష్ (ప్రజా కలం రిపోర్టర్ నందిగామ మండలం) భార్యకు తెలంగాణ మీడియా అకాడమీ సంక్షేమ నిధి నుండి మంజూరైన టీయూడబ్ల్యూజే (ఐజేయు) మఫీషియల్ రాష్ట్ర కమిటీ కన్వీనర్ పేపర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ, 1లక్ష రూపాయల చెక్కుని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.... యూనియన్ లో ఉన్న ఏ జర్నలిస్టుకు ఇబ్బందులు ఎదురైన టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ అండగా ముందుండి ఆదుకుంటుందని వెల్లడించారు. జర్నలిస్టు మృతి చెందితే వారి కుటుంబానికి ఇబ్బంది కలగవద్దనే ఉద్దేశంతో యూనియన్ ఆర్థిక భరోసాను కల్పిస్తుందని అన్నారు. మృతి చెందిన జర్నలిస్టు కుటుంబానికి తెలంగాణ మీడియా అకాడమీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వివరించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం మీడియా అకాడమీ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. మృతి చెందిన జర్నలిస్టు భార్యకు నెలకు రూ, 3000 పింఛన్ ఇవ్వడంతో పాటు ఇద్దరి పిల్లలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున ట్యూషన్ ఫీజు కూడా తెలంగాణ మీడియా అకాడమీ సంక్షేమ నిధి నుండి అందించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవేందర్ యాదవ్, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ అధ్యక్షులు నరసింహ, ప్రింట్ మీడియా ఉపాధ్యక్షులు మల్లికార్జున్ నాయక్, సంతోష్ గుప్త, ప్రింట్ మీడియా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి రమేష్, జిల్లా ఈసీ మెంబర్ ఎండి. ఇలియాజ్, డివిజన్ సంయుక్త కార్యదర్శి అల్వాల దర్శన్ గౌడ్, ఎలక్ట్రానిక్ మీడియా జనరల్ సెక్రటరీ ఫయాజ్, ఎలక్ట్రానిక్ మీడియా డివిజన్ ఉపాధ్యక్షులు శివకుమార్ గౌడ్, ప్రింట్ మీడియా ప్రధాన కార్యదర్శిలు నీరటి శివకుమార్, సమీ సాబేర్, డివిజన్ సంయుక్త కార్యదర్శి సవ్వాల రాజు, నరసింహ పాల్గొన్నారు.



## డిఎంహెచ్ఓకు పదవి విరమణ

### శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్

**రంగారెడ్డి జిల్లా మహా:** పదవి విరమణ అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో తప్పనిసరి అని, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు పదవి విరమణ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయంలో పదవి విరమణ కార్యక్రమం నిర్వహించి, డాక్టర్ వెంకటేశ్వరరావుని సన్మానించడం జరిగినది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పదవి విరమణ అనేది ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో తప్పనిసరని, తన ఉద్యోగ జీవితంలో ఎలాంటి అవరోధం లేకుండా వీధి నిర్వహించడం జరిగిందని అన్నారు. పదవీ విరమణ తర్వాత మీ జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కొత్త అధ్యాయం మీకు ప్రశాంతతను, సంతోషాన్ని ఇవ్వాలని ఆశిస్తున్నాను. పదవి విరమణ కార్యక్రమానికి హాజరైన పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డిఆర్ఓ సంగీత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి

### మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి



**భూపాలపల్లి, మహా :** కాంగ్రెస్ పార్టీ ప్రజలకు బాకీ పడ్డ కాంగ్రెస్ బాకీ కార్డు ను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మంగళవారం విడుదల చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ..రానున్న స్థానిక సంస్థల్లోగెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలి అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలల్లో అన్ని వర్గాల ప్రజలకు ఎంత బాకీ పడ్డదో కాంగ్రెస్ బాకీ కార్డు ద్వారా ప్రజలకు తెలియచేసి ఓటు కోసం మీ ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీసి అడిగేలా వారిని చైతన్యవంతులను చేయాలని కోరారు.

## బీఆర్ఎస్ అధ్యక్షుడు జోడు శ్రీనివాస్ అరెస్టుపై ఎస్పీ విచారణ జరపాలి

### మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



**కాటారం, మహా :** మంథనియా నియోజకవర్గంలో పోలీసులు బిఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజలలో పోలీసులు అంటే చులకన భావం ఏర్పడేలా చేస్తున్నారని బిఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ తీవ్రంగా ఆరోపించారు. పోలీసులు తీవ్రంగా హింసించి అక్రమ కేసు బనాయించిన బిఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు జోడు శ్రీనివాసు ను పరామర్శించారు. మంగళవారం కాటారం మండల కేంద్రం గారేపల్లి అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పోలీసులు కాకి డ్రెస్ వేసుకొని నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని అందుకే కాకి దుస్తులు ధరించిన వెంకన్న పారిశుద్ధ్య కార్మికుడు ఎంత నిజాయితీగా ఉంటున్నారో అతనికి చౌరస్తాలో పాదాలు కడిగి పూలదండ వేసి పుట్ట మధుకర్ పౌర సన్మానం చేశారు. కాటారం సిఐ నాగార్జున రావు తాగిన మైకంలో టిఆర్ఎస్ అధ్యక్షుడు జోటు శ్రీనివాస్ ఇంటికెళ్ళి ఆదివారం అర్ధరాత్రి అక్రమ అరెస్టు చేశారని, ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి సీఐపై కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్పీని పుట్ట మధుకర్ డిమాండ్ చేశారు. కాటారం డిఎస్పి సంఘటన అంతా చూస్తూ ప్రేక్షక పాత్ర వహించారని చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మంథని నియోజకవర్గంలో పోలీసుల వ్యవహారశైలి రోజురోజుకు శృతి మించుతోందన్నారు. ఖాకీ డ్రెస్సు వేసుకునే ఆటో డ్రైవర్లు, ఫ్యాకర్టీల్లో పని చేసే కార్మికులు, ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం మురుగు కంపును తొలగించే సఫాయి కర్మచారి కార్మికులు ఎంతో గొప్పవారని వారంతా ఆదర్శంగా నిలుస్తుంటే ఖాకీలు మాత్రం నీచంగా తయారు అవుతున్నారన్నారు. ఈ నెల 28న అర్థరాత్రి దాటిన తర్వాత కాటారం సీఐ నాగార్జున రావు తప్పతాగి తాగిన మత్తులో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ జోకర్ తమ్ముడి ఆదేశాలతో బీఆర్ఎస్ మండల ఇంచార్జ్ జోడు శ్రీనివాస్‌ను అక్రమ అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. భారత రాజ్యాంగం ప్రకారం నియమితులైన పోలీసులు చట్టవిరుద్ధంగా విధులు నిర్వహిస్తున్నారని, వారి మెప్పుకోసం ఇలాంటి ప్రయత్నాలు చేసినా రాబోయే కాలంలో ఎక్కడ విధులు నిర్వర్తించిన శంకరగిరి మాన్యాలు పట్టిస్తామని పుట్ట మధుకర్ హెచ్చరించారు. టిఆర్ఎస్ నాయకులపై అంచవేత ధోరణితో ఎంత ఒత్తిడితో కేసులు నమోదు చేసిన అంతే ఒత్తిడితో బయటకు వస్తూ పోలీసులు అంటే హేళన చేసే పరిస్థితి ఉందని సిగ్గుచేటని విమర్శించారు. ఎమ్మెల్యే 420 దొంగ మేనిఫెస్టో తయారుచేసిన అతనికి రాజ్యాంగం పట్ల నమ్మకం లేదని ఇక్కడే ప్రజలు చైతన్యవంతులు అయితే తన సీటుకు యసర్ వస్తుందని ఉద్దేశంతో విద్యావంతులు కానీవ్వకుండా అడ్డుపడుతున్నాడని పుట్ట మధు ఆక్షేపించారు.

# దసరా కానుక.. సమాజ సేవకులు కనుక

- **పారిశుద్ధ కార్మికులకు రూ.2 వేలు ఎమ్మెల్యే నజరానా**
- **షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఔదార్యం**
- **సొంత ఖర్చుతో నగదు చెల్లింపు**
- **పారిశుద్ధ్య కార్మికుల కృతజ్ఞతాభివందనం**

**షాద్ నగర్, మహా:** నిత్యం వీధుల్లోకి బయలుదేరి. తెల్లవారేసరికి దుర్గంధ నిర్మూలన కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే సమాజ సేవకులు పారిశుద్ధ్య కార్మికులు.. అలాంటి పారిశుధ్య కార్మికులకు నిరంతరం అండగా ఉండే షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మరోసారి ఔదార్యాన్ని ప్రదర్శించారు. ప్రబాలిక పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికులందరికీ రూ.2 వేల చొప్పున ఒక్కొక్కరికి దసరా నజ్రానాలు సొంతంగా అందించారు. మంగళవారం పట్టణ మున్సిపాలిటీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. 140 మంది కార్మికులందరికీ కలిపి మొత్తంగా రూ.2.80 లక్షలు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుద్ధ కార్మికులు లేకపోతే ఆరోగ్యం అగాధంలో పడుతుందని ఆయన అన్నారు. కరోనా సమయంలో వాళ్లు గనక లేకపోతే ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయి ఉండేవని పేర్కొన్నారు. అలాంటి కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ఆయన స్పష్టం చేశారు. పురపాలిక కమిషనర్ సునీత, కాంగ్రెస్ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు..



# దేశంలోనే తొలి ఏఐ కాల్ అసిస్టెంట్.. త్వరలో ప్రారంభం




ఏదో ముఖ్యమైన పనిలో బిజీగా ఉన్న సమయంలో వచ్చే స్పామ్ కాల్స్ చిరాకు తెప్పిస్తుంటాయి. ఇకపై అలాంటి కాల్స్‌తోపాటు ఫోన్‌లోని కాంటాక్ట్ లిస్ట్‌లో లేని కాల్స్‌కు సమాధానం ఇచ్చేలా హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ 'ఈక్వల్ఏఐ' కొత్తగా ఇంటెలిజెంట్ కాల్ అసిస్టెంట్‌ను రూపొందించింది. ఇది ఆయా కాల్స్‌ను గుర్తించి ఎదుటి వ్యక్తితో వాస్తవికంగా మాట్లాడి బ్రీఫ్‌గా అందులోని సారాంశాన్ని సందేశం రూపంలో యూజర్ ముందుంచుతుంది. దీన్ని అక్టోబర్ 2న న్యూఢిల్లీలో ప్రారంభించనున్నట్లు కంపెనీ తెలిపింది. భారతదేశంలో దాదాపు 100 కోట్ల స్మార్ట్ ఫోన్ వినియోగదారులు ఉన్నారు. 60% మంది భారతీయులు రోజుకు 3 కంటే ఎక్కువ స్పామ్ కాల్స్‌తో ఇబ్బంది పడుతున్నట్లు కొన్ని సర్వేలు చెబుతున్నాయి. ఇప్పటికే డునాట్ డిస్టర్బ్(DND) రిజిస్ట్రీలు, కాలర్ ఐడీ యాప్‌లు ఉన్నప్పటికీ స్పామ్ కాల్స్ పెరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో యూజర్లకు వీటి నుంచి ఉపశమనం కలిగించేలా ఈక్వల్ ఏఐ ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా కొత్తగా ఏఐ అసిస్టెంట్‌ను ప్రారంభించనుంది.

### ట్రయల్ సక్సెస్

ఈక్వల్ ఏఐ టూల్ ట్రయల్స్ సమయంలో 87% అంతరాయాలను సమర్థంగా నిర్వహించినట్లు కంపెనీ తెలిపింది. పార్సిల్ డెలివరీలను సమన్వయం చేసుకోవడంలో యూజర్లు గడిపే సమయాన్ని 73% తగ్గించినట్లు పేర్కొంది. 94% స్పామ్ కాల్స్‌ను గుర్తించి అందుకు అనుగుణంగా స్పందించినట్లు తెలిపింది. అయితే కాంటాక్ట్ లిస్ట్‌లో సేవ్ అయిన నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌కు ఇది సమాధానం ఇవ్వదని గమనించాలి. డెలివరీ ఏజెంట్లతో మాట్లాడే క్రమంలో చిరునామాలు లేదా సూచనలు ఇస్తుంది. లైవ్ కాల్ ట్రాన్స్క్రిప్ట్ అందిస్తుంది. యూజర్ ఎప్పుడైనా నేరుగా కాల్‌కు సమాధానం ఇవ్వొచ్చు. భారతీయ భాషలు, కాలర్ నమూనాలపై శిక్షణ పొందింది. ప్రాథమికంగా ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో ఆండ్రాయిడ్ వినియోగదారులకు అక్టోబర్ 2, 2025 నుంచి ఈ సేవలు ప్రారంభం అవుతాయని కంపెనీ తెలిపింది. 2025 నాలుగో త్రైమాసికం నాటికి ముంబై, బెంగళూరు, హైదరాబాద్‌లకు ఈ సర్వీసులు విస్తరిస్తాయని పేర్కొంది.

# లిస్టింగ్ బాటలో 7 కంపెనీలు

**కొద్ది రోజులుగా దుమ్మురేపుతున్న ప్రైమరీ మార్కెట్లు భవిష్యత్‌లో మరింత దూకుడు ప్రదర్శించనున్నాయి. దిగ్గజాలు టాటా క్యాపిటల్, వియ్‌వర్క్ ఇండియా ఐపీవోలు వచ్చే వారం ప్రారంభం కానుండగా.. తాజాగా 7 కంపెనీలు లిస్టింగ్ బాట పట్టాయి. ఇందుకు అనుగుణంగా సెబీకి దరఖాస్తు చేశాయి. వివరాలు చూద్దాం..**

## జాబితాలో హోటల్ పోలో, బాంబే కోటెడ్

### ఏపీపీఎల్ కంటెయినర్స్, ధరీవాల్ బిల్డ్‌టెక్ ఆర్డీ ఇండస్ట్రీస్, కుసుమార్గ్, బాన్‌బ్లాక్ టెక్నాలజీస్..




క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ఏడు కంపెనీలు ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. జాబితాలో హోటల్ పోలో టవర్స్, బాంబే కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్స్, ఏపీపీఎల్ కంటెయినర్స్, బాన్‌బ్లాక్ టెక్నాలజీస్, ధరీవాల్ బిల్డ్‌టెక్, ఆర్డీ ఇండస్ట్రీస్, కుసుమార్గ్ చేరాయి. ఐపీవోలో భాగంగా స్టీల్ ప్రాసెసింగ్ సెంటర్లను నిర్వహించే బాంబే కోటెడ్ 1.5 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. స్టీల్ క్యాయిళ్ల ప్రాసెసింగ్‌లో ప్రత్యేకతను కలిగిన కంపెనీ ప్రస్తుతం 3,50,411 టన్నుల వార్షిక సామర్థ్యాన్ని అందుకుంది. గతేడాది(2024-25) ఆదాయం రూ. 1,056 కోట్లను తాకగా, రూ. 29 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఐపీవోలో భాగంగా మధ్యస్థాయి ఆతిథ్య రంగ కంపెనీ హోటల్ పోలో టవర్స్ రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 71.2 లక్షల షేర్లను కంపెనీ ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను విస్తరణ, ప్రస్తుత ప్రాపర్టీల ఆధునీకరణ, రుణ చెల్లింపులు తదితర అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ పోలో, మ్యాక్స్ బ్రాండ్లతో ప్రధానంగా దేశ ఉత్తర, తూర్పు, ఈశాన్య ప్రాంతాలలో మధ్యస్థాయి హోటళ్లు, రిసార్టులను నిర్వహిస్తోంది. త్రిపుర, కోల్‌కతా, మేఘాలయ, షిల్లాంగ్, ప్రయాగ్‌రాజ్, జబల్‌పూర్ తదితర ప్రాంతాలలో 425 గదులతో హోటళ్లను నిర్వహిస్తోంది. గతేడాది(2024-25) ఆదాయం రూ. 118 కోట్లను తాకగా, రూ. 22 కోట్ల నికర లాభం ఆర్జించింది. గుజరాత్‌లోని భావనగర్ కేంద్రంగా ఏర్పాటైన ఏపీపీఎల్ కంటెయినర్స్ ఐపీవోలో భాగంగా 12.5 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా ప్రమోటర్లు మరో 25.6 లక్షల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలతో పాటు.. రుణ చెల్లింపులకు వినియోగించనుంది. 2021లో ఏర్పాటైన కంపెనీ ప్రధానంగా కంటెయినర్ తయారీలో కార్యకలాపాలు విస్తరించింది. గతేడాది(2024-25) ఆదాయం రూ. 69 కోట్లను తాకగా, రూ. 33 కోట్ల నికర లాభం ఆర్జించింది. బ్లాక్‌చెయిన్, ఐవోటీ, డేటా సైన్స్ ఆధారంగా సాస్ సొల్యూషన్లు అందించే బాన్‌బ్లాక్ టెక్నాలజీస్ ఐపీవోలో భాగంగా రూ. 230 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా 2020లో ఏర్పాటైన చెన్నై కంపెనీ ప్రమోటర్ బాన్‌బ్లాక్ ఇంక్ 3 కోట్ల షేర్లను ఆఫర్ చేయనుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 136 కోట్లు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ప్లాట్‌ఫామ్స్‌కు, రూ. 13 కోట్లు ల్యాప్‌టాప్‌ల కొనుగోళ్లకు వినియోగించనుంది. మరికొన్ని నిధులను ఇతర సంస్థల కొనుగోళ్లు తదితరాలకు వెచ్చించనుంది. కంపెనీ ఏఐ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ సరీవసులు, సాఫ్ట్‌వేర్ సొల్యూషన్లలో వేగంగా విస్తరిస్తోంది. ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ధరీవాల్ బిల్డ్‌టెక్ ఐపీవోలో భాగంగా రూ. 950 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. ఇష్యూ నిధులలో రూ. 203 కోట్లు ఎక్విప్‌మెంట్ కొనుగోలుకి, రూ. 174 కోట్లు, రూ. 300 కోట్లు సంస్థతోపాటు అనుబంధ కంపెనీ రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. కంపెనీ ప్రధానంగా రోడ్లు, హైవేలు, బ్రిడ్జిలు, సొరంగాలు తదితర నిర్మాణాలు చేపడుతోంది. గతేడాది(2024-25) ఆదాయం రూ. 1,153 కోట్లను తాకగా, రూ. 161 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇంధన స్టోరేజీ, నాన్‌ఫెర్రస్ స్క్రాప్ నుంచి రికవరీ, రీసైక్లింగ్ చేపట్టే ఆర్డీ ఇండస్ట్రీస్ ఐపీవోలో భాగంగా రూ. 320 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా ప్రమోటర్లు మరో 3.76 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 220 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, రూ. 22 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. లెడ్ అల్లాయ్స్, లెడ్ టిన్, లెడ్ సిల్వలర్ తదితర ప్రొడక్టులను రూపొందిస్తోంది. కంపెనీకి ఆంధ్రప్రదేశ్‌లో తయారీ ప్లాంటు ఉంది. ఇంజనీర్డ్ ఫ్యాబ్రిక్ తయారీ సంస్థ కుసుమార్గ్ ఐపీఓ ద్వారా రూ.650 కోట్ల నిధుల సమీకరణకు సిద్ధమైంది. 1990లో ఏర్పాటైన కంపెనీ ఏరోస్పేస్, డిఫెన్స్, పారిశ్రామిక, ఆటోమోటివ్ రంగాల కోసం ఫ్యాబ్రిక్స్ దస్తులు తయారు చేస్తుంది. కంపెనీకి గుజరాత్‌లో ఆరు మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లతో పాటు ఉత్తరప్రదేశ్‌లో ఒక ఫ్యాబ్రికేషన్ యూనిట్ ఉంది. ఆర్థిక సంవత్సరం 2025 గానూ రూ.779 కోట్ల ఆదాయాన్ని, రూ.112 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది.

# దేశంలో అత్యంత సరసమైన 5 బైకులు ఇవే!

**భారతదేశంలో ద్విచక్ర వాహన మార్కెట్ గణనీయంగా అభివృద్ధి చెందుతోంది. లెక్కకు మించిన కంపెనీలు దేశీయ విఫణిలో కొత్త టూ వీలర్స్ లాంచ్ చేస్తూనే ఉన్నాయి. అయితే జీఎస్టీ 2.0 (GST 2.0) అమలులోకి వచ్చిన తరువాత వీటి ధరలు చాలా వరకు తగ్గాయి. ఈ కథనంలో ఇండియన్ మార్కెట్లోని సరసమైన బైకులు ఏవి?, వాటి ధరలు ఎలా ఉన్నాయనే విషయాలు తెలుసుకుందాం.**

**బజాజ్ ప్లాటినా 100**

బజాజ్ ప్లాటినా 100 ధర రూ. 65,407 (ఎక్స్ షోరూమ్) చేరింది. ఈ బైక్ 102 సీసీ ఎయిర్‌కూల్డ్ ఇంజిన్ ద్వారా 7.9hp పవర్ & 8.3Nm టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇది 4స్పీడ్ గేర్‌బాక్స్ ఆప్షన్ పొందుతుంది. ఇది 70 కిమీ/లీ కంటే ఎక్కువ మైలేజ్ అందిస్తుంది.

**హోండా షైన్ 100**

హోండా షైన్ 100 ధర రూ. 63,191 (ఎక్స్ షోరూమ్). ఇందులోని 98.98 సీసీ ఇంజిన్ 7.38 హార్స్ పవర్, 8.04 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇంజిన్ 4 స్పీడ్ గేర్‌బాక్స్‌తో లభిస్తుంది. మంచి డిజైన్, ఫీచర్స్ కలిగి.. కొంత ఎక్కువ మైలేజ్ ఇస్తున్న కారణంగా ఈ బైకుకు ఇండియన్ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది.

**హీరో హెచ్‌ఎఫ్ 100**

హీరో హెచ్‌ఎఫ్ 100 ధర రూ. 58739 (ఎక్స్ షోరూమ్). ఈ బైకులోని 97.2 సీసీ ఎయిర్‌కూల్డ్ ఇంజిన్.. 7.9 హార్స్ పవర్, 8.05 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇంజిన్ 4 స్పీడ్ గేర్‌బాక్స్‌తో జత చేయబడి అత్యుత్తమ పనితీరును అందిస్తుంది. ఇది 65 కిమీ/లీ మైలేజ్ అందిస్తుంది. కాబట్టి రోజువారీ వినియోగానికి చాలా అనుకూలంగా ఉంటుంది.

**టీవీఎస్ స్పోర్ట్ ఈఎస్**

దేశంలోని అత్యంత సరసమైన బైకుల జాబితాలో.. టీవీఎస్ స్పోర్ట్ ఈఎస్ కూడా ఒకటి. దీని ధర రూ. 55100 (ఎక్స్ షోరూమ్). ఈ బైక్ 109.7 సీసీ ఇంజిన్ ద్వారా 7.3 హార్స్ పవర్, 7.5 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ బైక్ 2020లో బీఎస్6 ఉద్గార నిబంధనలకు అనుకూలంగా అప్డేట్ అయింది.



## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL



# కుప్పకూలిన స్కూల్ బిల్డింగ్..

## శిథిలాల కింద 38 మంది!



ఇండోనేషియాలో ఘోర ప్రమాదం సంభవించింది. ఈస్ట్ జావా రాష్ట్రం సిడోయార్జ్ పట్టణంలో ఓ ప్రైవేట్ స్కూల్ భవనం కుప్పకూలిపోయింది(School Building Collapse). ఈ ఘటనలో ఒక విద్యార్థి మరణించగా.. వంద మందికి పైగా విద్యార్థులకు గాయాలయ్యాయి. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోవడంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం ఆ ఇస్లామిక్ స్కూల్‌లో ప్రార్థనలు జరుగుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. భవనం కుప్పకూలడంతో ఒక విద్యార్థి (13) అక్కడికక్కడే మరణించాడు. గాయపడిన వాళ్లను ఆస్పత్రికి తరలించగా.. వాళ్లలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉంది. మరో 38 మంది విద్యార్థుల ఆచూకీ తెలియాల్సి ఉంది. వీళ్లంతా శిథిలాల్లో చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. శిథిలాల కింది నుంచి చిన్నారుల కేకలతో, తల్లిదండ్రుల రోదనలతో ఆ ప్రాంతమంతా మారుమోగిపోతోంది. కాంక్రీట్ దిమ్మెలు భారీ పరిణామంలో ఉండడం.. వాటిని కదిలిస్తే మరింత కుప్పకూలిపోయే అవకాశం ఉండడంతో సహాయక చర్యలు జాగ్రత్తగా, నిదానంగా సాగుతున్నాయి. సోమవారం అర్ధరాత్రి దాటాక కూడా సహాయక చర్యలు కొనసాగాయి. రెస్క్యూ బృందాలు(Rescue Teams) తీవ్రంగా శ్రమించి.. 102 మందిని రక్షించినట్లు కాంపోస్.డాట్ కామ్ అనే స్థానిక మీడియా వెబ్‌సైట్ కథనం ఇచ్చింది. స్కూల్ భవనం పాతది కావడం.. అనుమతి లేకుండా పై అంతస్తుల నిర్మాణాలు చేపట్టడంతోనే ఈ దుర్ఘటన చోటు చేసుకుందని స్థానిక అధికారులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీస్ ప్రతినిధి జూల్స్ అబ్రహాం అబాస్ట్ తెలిపారు.



# లండన్‌లో గాంధీ విగ్రహం ధ్వంసం..

## తీవ్రంగా స్పందించిన భారత్

**లండన్:** లండన్‌లో మహాత్మాగాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. లండన్‌లోని టావిస్టాక్ స్క్వేర్‌లో ఉన్న గాంధీ విగ్రహంపై నల్ల రంగుతో విద్వేష పూరిత వ్యాఖ్యలు రాశారు. మహాత్ముని జయంతికి మూడు రోజుల ముందు జరిగిన ఈ ఘటనపై అక్కడి భారత రాయబార కార్యాలయం తీవ్రంగా ఖండించింది. ఈ పిచ్చి రాతలను సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించింది. అహింస వారసత్వంపై జరిగిన దాడిగా పేర్కొంది. మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేయడం పాటు తీవ్రంగా ఖడిస్తున్నామని భారత రాయబార కార్యాలయం ఎక్స్ వేదికగా వెల్లడించింది. మహాత్ముని జయంతి (అక్టోబర్ 2)ని ప్రతి ఏడాది అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాగా, ప్రముఖ కళాకారిణి ఫ్రెడ్డా బ్రిలియంట్ రూపొందించిన గాంధీజీ కాంస్య విగ్రహాన్ని లండన్‌లోని టావిస్టాక్ స్క్వేర్‌లోని యూనివర్సిటీ కాలేజ్ సమీపంలో 1968లో ప్రతిష్ఠించారు. విగ్రహ ధ్వంసం గురించి స్థానిక అధికారులకు సమాచారం ఇచ్చారు. విగ్రహాన్ని తిరిగి పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు.

# గాజా ఘర్షణల అంతానికి పిలుపు

## ట్రంప్‌కు ప్రధాని మోదీ మద్దతు



**న్యూఢిల్లీ:** గాజా ఘర్షణలను అంతం చేసే దిశగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమగ్ర ప్రణాళిక ప్రకటించడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. అధ్యక్షుడు ట్రంప్ చూపిన చొరవకు అందరూ మందుకువస్తారని, గాజాలో ఘర్షణలను అంతం చేసేందుకు, శాంతిని నెలకొల్పేందుకు మద్దతు పలుకుతారని తాను ఆశిస్తున్నానని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌హమాస్ యుద్ధంతో పాటు గాజా ఘర్షణలను అంతం చేసేందుకు ట్రంప్ రూపొందించిన ప్రణాళికను వైట్ హౌస్ విడుదల చేసిన కొన్ని గంటలకు ప్రధాని మోదీ నుండి ఈ ప్రకటన విడుదలయ్యింది. అయితే అమెరికా ప్రభుత్వం రూపొందించిన ఈ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ లేదా హమాస్ అంగీకరించాయా లేదా అనే దానిపై ఇప్పటివరూ సమచారమేదీ లేదు. అయితే ఇంతలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గాజాలో యుద్ధాన్ని ముగించే ప్రణాళికకు అంగీకారం తెలిపారని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. కానీ హమాస్ ఈ నిబంధనలను అంగీకరిస్తుందా లేదా అనేది తెలియరాలేదు. ఇజ్రాయెల్‌హమాస్ ఘర్షణల ముగింపునకు ట్రంప్ 20 సూత్రాల ప్రణాళికను రూపొందించారు. బ్రిటిష్ మాజీ ప్రధాన మంత్రి టోనీ బ్లెయిర్‌తో సారథ్యంలో యుద్ధబాధిత పాలస్తీనా భూభాగంలో తాత్కాలిక పాలక మండలిని ఏర్పాటు చేయడానికి అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించారు. ఈ ప్రణాళిక ప్రకారం ప్రజలు గాజాను విడిచి వెళ్లాల్సిన అవసరం లేదు. ఇరు వైపులా పరస్పర అంగీకారంతో యుద్ధాన్ని వెంటనే ముగించాలని ట్రంప్ ఆ ప్రణాళికలో పిలుపునిచ్చారు. ఈ ప్రణాళికను అంగీకరించిన 72 గంటల్లోపు హమాస్ తమ దగ్గరున్న ఇజ్రాయెల్ బందీలందరినీ విడుదల చేయాలని కూడా ప్రణాళికలో పేర్కొన్నారు. ఈ ప్రతిపాదిత శాంతి ఒప్పందాన్ని హమాస్ అంగీకరించకపోతే ఇజ్రాయెల్‌కు యునైటెడ్ స్టేట్స్ పూర్తి మద్దతు ఉంటుందని ట్రంప్ హామీనిచ్చారు. పాలస్తీనా ప్రజలు వారి విధికి బాధ్యత వహించాలని, తమ శాంతి ప్రతిపాదనను స్వీకరించాలని కోరారు.



# గాజా ఆక్రమణ ఉండదు

## శాంతిని నెలకొల్పుతాం.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. వైట్‌హౌస్‌లో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో భేటీ

**వాషింగ్టన్:** గాజా సంక్షోభంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. గాజాను ఇజ్రాయెల్ ఆక్రమించబోదని తేల్చిచెప్పారు. ఇజ్రాయెల్ -హమాస్ మధ్య యుద్ధానికి త్వరగా తెరపడాలన్నదే తన ఉద్దేశమని వివరించారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సోమవారం వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడారు. గాజాలో అస్థిరతకు చరమగీతం పాడేసి, శాంతిని నెలకొల్పే దిశగా నెతన్యాహుతో ఒప్పందానికి దరిదాపుల్లోకి వచ్చానని అన్నారు. ఈ ప్రణాళికకు అంగీకారం తెలియజేసినందుకు నెతన్యాహుకు ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. గాజాలో శాంతి సాధన విషయంలో ఇదొక చరిత్రాత్మక దినం అని వ్యాఖ్యానించారు. మధ్యప్రాచ్యంలో శాశ్వత శాంతికి అడుగు ముందుకు పడినట్లేనని ఉద్ఘాటించారు. తాను ప్రతిపాదించిన శాంతి ఒప్పందాన్ని హమాస్‌తోపాటు ఇతర భాగస్వామ్య పక్షాలు సైతం ఆమోదిస్తాయని ట్రంప్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఒకవేళ ఆమోదం లభిస్తే గాజాలో తక్షణమే యుద్ధానికి తెరపడుతుందని తేల్చిచెప్పారు. నెతన్యాహు మాట్లాడుతూ... గాజా విషయంలో దీర్ఘకాల పరిష్కారానికి తాము కట్టుబడి ఉన్నట్లు స్పష్టంచేశారు. అదే సమయంలో ప్రాంతీయ భద్రతను కూడా దృష్టిలో పెట్టుకోవాలని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రాచ్యంలో సాధారణ పరిస్థితులను పునరుద్ధరించే విషయంలో నెతన్యాహుతో చర్చలు ఒక భాగమేనని ట్రంప్ పేర్కొన్నారు.

### ఖతార్ ప్రధానమంత్రికి నెతన్యాహు క్షమాపణ

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఖతార్ ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ అల్-థానీకి ఫోన్ చేసి క్షమాపణ కోరారు. ఇటీవల ఖతార్ రాజధాని దోహాపై ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఐదుగురు మరణించారు. ఈ ఉదంతం ముస్లిం దేశాల్లో అలజడి సృష్టించింది. ఇజ్రాయెల్ తీరును ప్రపంచ దేశాలు ఖండించాయి. ఈ నేపథ్యంలో వైట్‌హౌస్‌లో డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన నెతన్యాహు అక్కడి నుంచే ఖతార్ ప్రధానికి ఫోన్‌చేశారు. దోహాపై దాడుల పట్ల విచారం వ్యక్తంచేశారు. క్షమాపణ కోరారు. భవిష్యత్తులో మరోసారి ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



# హీరోయిన్ గోల్స్..

గతేడాది డిసెంబరు నాగచైతన్యశోభిత పెళ్లి చేసుకున్నారు. అప్పటి నుంచి వీళ్లిద్దరూ ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తున్నారు. ఎప్పటికప్పుడు జంటగా కనిపిస్తున్నారు. రీసెంట్‌గా హైదరాబాద్‌లో ఓ షాపింగ్ మాల్ ఓపెన్ చేశారు. ఇకపోతే నాగచైతన్య.. ఓ హారర్ మూవీలో నటిస్తుండగా శోభిత మాత్రం మొన్నటివరకు కొత్త ప్రాజెక్టులేం ఒప్పుకోలేదు. దీంతో కొన్నాళ్ల గ్యాప్ ఇస్తుందా అనుకున్నార. కానీ అలాంటిదేం లేదని ఓ మూవీ ప్రకటనతో క్లారిటీ వచ్చేసింది. శోభిత ప్రెగ్నెన్సీతో ఉందని కొన్నాళ్ల క్రితం రూమర్స్ వచ్చాయి. అయితే అవి పుకార్లు మాత్రమేనని ఇప్పుడు ఓ తమిళ సినిమాలో గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో క్లారిటీ వచ్చేసింది. పా.రంజిత్ తీస్తున్న 'వెట్టువం' అనే చిత్రంలో శోభితని తీసుకున్నట్లు అధికారికంగానే ప్రకటించారు. గతంలో తమిళంలో మణిరత్నం తీసిన 'పొన్నియిన్ సెల్వన్'లో నటించింది. కాకపోతే అది హీరోయిన్ పాత్ర కాదు. ఇప్పుడు మాత్రమే ఈమెనే లీడ్. దినేశ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం ఆర్య మరో కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. శోభిత హీరోయిన్. పా.రంజిత్ సినిమాలన్నీ కాస్త డిఫరెంట్‌గా ఉంటాయి. ఇప్పుడు కూడా అలాంటి వైవిధ్యమైన కాన్సెప్ట్‌తోనే ఈ ప్రాజెక్ట్ ఉండబోతుందని తెలుస్తోంది. పెళ్లి తర్వాత శోభిత.. తెలుగులో ఏమైనా మూవీస్ చేస్తుందని చాలామంది అనుకున్నారు కానీ తమిళంలో కొత్త చిత్రానికి ఓకే చెప్పింది. గతంలో తెలుగులో గూఢచారి, మేజర్ మూవీస్ చేసింది.



## ఈడీ విచారణకు హాజరైన ఊర్వశి రౌతేలా

నిషేధిత బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలాకు చిక్కులు తప్పవని తెలుస్తోంది. తాజాగా ఈడీ విచారణకు ఊర్వశి హాజరైంది. కొద్దిరోజుల క్రితం విచారణకు రావాలని ఆమెకు ఈడీ కార్యాలయం సమన్లు పంపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఢిల్లీలోని ఈడీ ఆఫీస్‌కు వెళ్లింది. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసి ఎంత డబ్బు సంపాదించారు..? తనను వారు ఎలా సంప్రదించారు..? మనీ ట్రాన్షక్షన్స్ ఎలా చేస్తారు..? వంటి అంశాల గురించి ఈడీ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే టాలీవుడ్, బాలీవుడ్‌లోని స్టార్స్‌ను ఈడీ విచారించిన విషయం తెలిసిందే. విజయ్ దేవరకొండ, రానా, మంచు లక్ష్మి, సోనూ సూద్ వంటి స్టార్స్‌తో పాటు సురేశ్ రైనా వంటి క్రికెటర్స్ కూడా ఈ కేసులో ఉన్నారు.

## మొన్న కల్కి నుంచి ఔట్.. ఇప్పుడు దర్శకురాలితో...

బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొణె మరోసారి వార్తల్లో నిలిచింది. గతంలో రెండుసార్లు కలిసి పనిచేసిన ఓ దర్శకురాలి మాటలకు హర్ట్ అయింది. ఆమె ఏదో సరదాగా అన్న వ్యాఖ్యల్ని మరీ సీరియస్‌గా తీసుకున్న దీపిక.. దూరం పెట్టేసింది. సోషల్ మీడియాలోనూ అన్‌ఫాలో కొట్టేసింది. ఇంతకీ ఏంటా విషయం? ఎవరా డైరెక్టర్? కొన్ని రోజులు క్రితం దీపిక పదుకొణెని ప్రభాస్ 'స్పిరిట్' కోసం హీరోయిన్‌గా తీసుకోవాలని సందీప్ రెడ్డి వంగా అనుకున్నాడు. ఈ మేరకు డిస్కషన్ జరిగింది. అంతా ఓకే అనుకునే టైంలో దీపిక చెప్పిన కండీషన్స్ నచ్చక.. సందీప్ తన మూవీ నుంచి దీపికని పక్కకు తప్పించాడనే టాక్ వచ్చింది. దీంతో ఈ టైంలో చాలామంది సందీప్ కి సపోర్ట్‌గా నిలిచారు. మరికొందరు దీపికకు సపోర్ట్ చేశారు. మొన్నీమధ్య ప్రభాస్ 'కల్కి' టీమ్ కూడా దీపిక తాము తీయబోయే సీక్వెల్‌లో ఉండదని తేల్చి చెప్పారు. అయితే దీపిక.. రోజుకు 7 గంటలే పనిచేస్తానని చెప్పిందని, తన టీమ్ దాదాపు 25 మంది కోసం ఫైవ్ స్టార్ హోటల్‌లో రూమ్స్, ఫుడ్ లాంటివి కావాలని అడిగిందని.. అలానే రెమ్యునరేషన్ కూడా తొలి పార్ట్‌కి తీసుకున్న దానికంటే భారీగా డిమాండ్ చేసిందని.. అందుకే 'కల్కి' మేకర్స్ దీపికని తప్పించారని మాట్లాడుకున్నారు. తాజాగా ఓ షోలో బాలీవుడ్ కొరియోగ్రాఫర్ కమ్ డైరెక్టర్ ఫరా ఖాన్ పాల్గొంది. నటీనటుల వర్కింగ్ అవర్స్(పనిగంటలు) గురించి ఫన్నీగా కామెంట్ చేసింది. 'ఆమె ఇప్పుడు పనిచేసేదే 8 గంటలు, ఇక ఈ షోకు ఎలా వస్తారా? ఆమెకు అంత టైమ్ ఎక్కడ ఉంటుంది' అని చెప్పి దీపికని ఉద్దేశిస్తూ పరోక్షంగా ఫరా ఖాన్ ఫన్నీగా మాట్లాడింది. ఈ మాటలకు దీపిక బాగానే హర్ట్ అయిపోయినట్లు ఉంది. ఇన్‌స్టాలో ఫరా ఖాన్‌ని అన్‌ఫాలో చేసింది. దీంతో ఫరా కూడా దీపికని అన్‌ఫాలో చేసింది.





## అపజయం వెనుకే విజయం

"అపజయం ఎదురైనప్పుడు జీవితం ఆగిపోయింది అనుకుంటే మనం ఆగిపోతాం... ఆ అపజయాన్ని విజయానికి మెట్టుగా మార్చుకుంటే ముందుకు సాగిపోతాం" అంటున్నారు శ్రీనిధి శెట్టి. అందాల పాటీల్లో 'మిస్ సుప్ర నేషనల్ ఇండియా' కిరీటం దక్కించుకోవడం నుంచి, 'మిస్ స్మైల్'... వరకు పలు టైటిల్స్ శ్రీనిధి సొంతం. తొలి చిత్రం 'కేజీఎఫ్'తో హీరోయిన్‌గా విజయవంతంగా కెరీర్ మొదలుపెట్టిన శ్రీనిధి శెట్టి ఇప్పుడు ఫుల్ బిజీ. "ప్రతి స్త్రీ అమ్మవారిలా ఓ శక్తి స్వరూపిణి" అంటూ 'దసరా' సందర్భంగా శ్రీనిధి శెట్టి ప్రత్యేకంగా పంచుకున్న విశేషాలు. మా మంగళూరులో చాలా టెంపుల్స్ ఉన్నాయి. నవరాత్రి సమయంలో గుడిలో జరిగే పూజలు చాలా వైభవంగా ఉంటాయి. ఈ దసరా టైమ్‌లో వీలైనప్పుడల్లా గుడికి వెళుతుంటాను. మైసూర్‌లో నవరాత్రి పూజలను ఘనంగా చేస్తారు. మైసూర్ ప్యాలెస్‌ని బాగా డెకరేట్ చేస్తారు. జాతర జరుగుతుంది. స్టాల్స్ పెడతారు. 'మైసూర్ దసరా' చాలా పాపులర్. ఈ పండగ సమయంలో సిటీ మొత్తం జనాలతో కిటకిటలాడిపోతుంది. 'ఫాస్టింగ్' అనేది సైంటిఫికల్లీ, ట్రెడిషనల్లీ మంచిది అని నా అభిరపాయం. అయితే నవరాత్రి టైమ్‌లో ఉపవాసం ఉండను. కానీ నాన్ వెజ్‌కి దూరంగా ఉంటాను. నెలలో రెండుసార్లు ఏకాదశి వస్తుంది కదా... అప్పుడు ఉపవాసం ఉంటాను. ఏకాదశి వస్తోందంటే చాలు... 'నువ్వు ఫాస్టింగ్ ఉండాలి' అని నా బాడీ నాకు గుర్తు చేస్తుంది. నా మైండ్ అలా ట్యూన్ అయిపోయింది. చెడుపై మంచి గెలవడం అనేది దసరా థీమ్. ఒక చెడు ఉంటేనే మంచి జరుగుతుంది. అపజయాలను నేను ఇలానే భావిస్తాను. ఫెయిల్యూర్ ఎదురైతేనే కదా సక్సెస్ కోసం ప్రయత్నం చేస్తాం. సో... ఫెయిల్యూర్స్‌ని చెడుగా భావించను. చెడుని అంతం చేయడానికి అమ్మవారు ఏం చేసిందో మనందరికీ తెలుసు. అలాగే మనకు ఎదురయ్యే ఫెయిల్యూర్స్‌ని ఎదుర్కోవడానికి మనం సిద్ధంగా ఉండాలి. కొందరు మహిళలు సపోర్ట్‌ని ఆశిస్తారు. కానీ మనకు మనమే సపోర్ట్ సిస్టమ్ అవ్వాలి. మన శక్తిని మనం గుర్తించగలగాలి. నాకు ఏదైనా చెడు ఎదురైందనుకోండి అది నా 'స్టెప్పింగ్ స్టోన్' అని నమ్ముతాను. జీవితం లో ఎదురయ్యే సవాల్‌ని అలా అనుకుంటే సక్సెస్ అయిపోతాం.


EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com